

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 28-02-2026 | సంపుటి - 26 | సంచిక -279 | రూ : 4 | పేజీలు: 8

## అఫ్ఘాన్, పాక్‌లలో నెత్తుటేర్లు

- 274 మంది తాలిబన్లను హతమార్చామన్న ఇస్లామాబాద్
- 55 మంది పాక్ సైనికులను తుదముట్టించామన్న కాబుల్



2లో



### కేంద్రం సహకరిస్తే
## రాజకీయ పార్టీగా మారుస్తాం

- సాయుధ పోరాటాన్ని విరమిస్తాం.. పీఎల్‌జీఏనూ రద్దు చేస్తాం
- లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతల వెల్లడి
- సచివాలయంలో సీఎంతో భేటీ
- అమిత్‌షా దృష్టికి తీసుకెళ్తానన్న రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి ఒకవైపు...ఈ ప్రజాస్వామ్యం అంతా బూటకం, సాయుధ తిరుగుబాటు ద్వారానే రాజ్యాధికారం దక్కించుకోవాలని ఇటీవలి కాలం వరకు తుపాకులతో పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు మరోవైపు... వీరిరువురి చరిత్రాత్మక కలయికకు సచివాలయం వేదికైంది. డీజీపీ మొదలు పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో తరువాయి 2లో



### చంద్రబాబును కలిసిన
## భట్టి విక్రమార్క

- కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానం

2లో

### అదానీ గ్రూప్‌పై
## అమెరికా కన్నెర్ర

- ఆ సంస్థ సౌర దిగుమతులపై 126 శాతం టారిఫ్
- అమెరికా వాణిజ్యశాఖ నిర్ణయం

2లో





### జూన్ 2న
## భారీ బహిరంగ సభ

- '99 రోజుల కార్యక్రమం'పై మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- నేడు కార్యదర్శులతో, రేపు కలెక్టర్లతో సీఎం సమీక్ష

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వచ్చే జూన్ 2న భారీ బహిరంగసభ నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సర్కారు చేపట్టనున్న '99 రోజుల కార్యక్రమం' ఎజెండాపై మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం రాత్రి ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. అధికారులకు తరువాయి 2లో

### కవితకు
## భారీ ఊరట

- అభియోగాల నుంచి మూడేళ్లకు విముక్తి
- క్విడ్‌ప్రోకో ఊహాజనితమేనన్న న్యాయస్థానం

హైదరాబాద్: ఢిల్లీ మద్యం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై సీబీఐ అభియోగాలు నిరాధారంగా ఉన్నాయని ఢిల్లీ కోర్టు కొట్టివేయడంతో ఆమెకు భారీ ఊరట లభించింది. కవిత అరెస్టు నుంచీ జరిగిన పరిణామాలు అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశాలయ్యాయి. సీబీఐ అధికారులు తొలుత 2022 డిసెంబరులో హైదరాబాద్‌లోని కవిత నివాసంలో ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం..

తరువాయి 2లో



## రాష్ట్రానికి మరో ఉక్కు కర్మాగారం

- శ్రీసిటీలో ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్న అమెరికా-జపాన్ సంయుక్త సంస్థ ప్రొటీరియల్

2లో



### హైకోర్టుకు తొలి మహిళా
## ప్రధాన న్యాయమూర్తి!




- జస్టిస్ లిసా గిల్ పేరును సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- 2 నెలల ముందే సీజే పదవులు భర్తీ చేసే సంప్రదాయానికి శ్రీకారం

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా జస్టిస్ లిసా గిల్ రానున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో గురువారం సమావేశమైన కొలీజియం ఆమె పేరును కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదనకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డులకెక్కనున్నారు. హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ పదవీకాలం తరువాయి 2లో

### రూ.లక్ష కోట్లతో
## ఉద్యాన హబ్

- రాయలసీమను ప్రపంచ నంబర్ 1 చేస్తాం
- కౌలు రైతుల్ని ఆదుకుంటాం
- 40 లక్షల ఎకరాల్లో సాగు.. 100 కోట్ల టన్నుల ఉత్పత్తి లక్ష్యం
- సమర్థ జల నిర్వహణతో నీటి ఎద్దడి నివారణ
- వ్యవసాయ పద్దులపై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు



2లో

# అఫ్గాన్, పాక్‌లలో నెత్తుటేర్లు

కాబుల్: పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తాజాగా యుద్ధరూపం దాల్చాయి! ఇరు దేశాలు గురువారం రాత్రి నుంచి పరస్పరం భీకర దాడులు చేసుకుంటున్నాయి. తమ దాడుల్లో 274 మంది తాలిబన్లు హతమయ్యారని పాక్ ప్రకటించింది. మరో 400 మంది గాయపడ్డారని తెలిపింది. మరోవైపు తాము 55 మంది పాక్ సైనికులను తుదముట్టించామని అఫ్గాన్ పేర్కొంది. అయితే తాజా దాడుల్లో తమ సైనికులు 12 మందే మరణించారని ఇస్లామాబాద్ చెప్పగా.. తమవారు 13 మందే ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు వెల్లడించడం గమనార్హం. దీంతో మృతుల సంఖ్య విషయంలో కొంత గందరగోళం నెలకొంది. అఫ్గాన్‌తో ప్రస్తుతం తాము 'బహిరంగ యుద్ధం'లో ఉన్నామని పాకిస్థాన్ శుక్రవారం ప్రకటించింది. ఇస్లామాబాద్ సైన్యం ఈ నెల 22న అఫ్గాన్ సరిహద్దు ప్రాంతాల్లో భారీగా వైమానిక దాడులు చేపట్టింది. తమ దాడుల్లో 70 మంది ముష్కరులను హతమార్చామని నాడు వెల్లడించింది. అందుకు ప్రతీకారంగా అఫ్గాన్ గురువారం పాక్ సరిహద్దుల్లో విరుచుకుపడింది. దీంతో గురువారం అర్ధరాత్రి దాటాక అఫ్గాన్‌లోని కాబుల్, కాందహార్, పక్తియా ప్రావిన్సులపై 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్' పేరుతో ఇస్లామాబాద్ వైమానిక దాడులు నిర్వహించింది.

*** మా ఓపిక నశించింది: పాక్ రక్షణ మంత్రి**

అఫ్గాన్‌తో బహిరంగ యుద్ధంలో ఉన్నట్లే తాము భావిస్తున్నామని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "మా ఓపిక నశించింది. ఇక అఫ్గాన్‌తో బహిరంగ యుద్ధమే. మేం దూకుడుగా ముందుకెళ్తాం. తాలిబన్ల బలాలు, బలహీనతలన్నీ మాకు తెలుసు. నాటో బలగాల ఉపసంహరణ తర్వాత అఫ్గాన్‌లో శాంతి నెలకొంటుందనుకున్నాం. కానీ తాలిబన్లు అఫ్గాన్‌ను భారత వలస రాజ్యంగా మార్చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి ఉగ్రవాదులను సమీకరించుకొని.. ఉగ్రవాదాన్ని ఎగదోయడం మొదలుపెట్టారు. అఫ్గానీలకు కనీస మానవహక్కులను కూడా తాలిబన్లు కల్పించలేదు. మహిళలకు ఇస్లాం కల్పించిన హక్కులను లాగేసుకున్నారు" అని ఆసిఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భీకర దాడులతో సరిహద్దుల్లో అఫ్గాన్‌కు చెందిన 73 పోస్టులను తాము ధ్వంసం చేశామని, మరో 18 పోస్టులను స్వాధీనం చేసుకున్నామని పాక్ సమాచార శాఖ మంత్రి అతావుల్లా తరార్ తెలిపారు. 115 యుద్ధట్యాంకులు, శతఘ్నులను కూడా ధ్వంసం చేశామన్నారు. తాలిబన్ల దాడుల్లో పాక్ సైనికులు 12 మందే మరణించారని పేర్కొన్నారు.

**పాక్ సైనికులను బంధించాం: అఫ్గాన్**

డ్యూరాండ్ రేఖ వెంబడి తాము జరిపిన ప్రతీకార దాడుల్లో 55 మంది పాక్ సైనికులు హతమయ్యారని అఫ్గాన్ రక్షణ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. మరికొందరిని బందీలుగా తీసుకున్నామనీ తెలిపింది. పాక్ సైన్యానికి చెందిన రెండు కీలక కార్యాలయాలు, 19 చెక్‌పోస్టులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. పాక్‌పై దాడులు ఇంకా ముగియలేదని స్పష్టం చేసింది. ఆ దేశ దాడుల్లో తమవారు 13 మందే మరణించారని పేర్కొంది.

# హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి!

దిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ లిసా గిల్ రానున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో గురువారం సమావేశమైన కొలీజియం ఆమె పేరును కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదనకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డులకెక్కనున్నారు. హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ పదవీకాలం ఏప్రిల్ 24తో ముగియనుంది. ఈ నేపథ్యంలో రెండు నెలల ముందుగానే జస్టిస్ లిసా గిల్‌ను న్యాయమూర్తిగా ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం నిర్ణయించింది. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ బాధ్యతల నుంచి వైదొలిగిన మరుసటిరోజు నుంచి జస్టిస్ లిసా గిల్‌ను సీజేగా ప్రతిపాదిస్తు సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఆమె పంజాబ్ హరియాణా హైకోర్టులో సేవలందిస్తున్నారు. అక్కడ సీనియారిటీ పరంగా మూడో స్థానంలో ఉన్నారు. స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య, ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పూర్తిచేశారు. 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని పంజాబ్ హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సుదీర్ఘకాలం చండీగఢ్‌కు, పలు ప్రభుత్వరంగ బోర్డులకు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు. 2014 మార్చి 31న పంజాబ్‌హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

**భర్తీలో కొత్త సంప్రదాయం**

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల పదవుల భర్తీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజే పదవీవిరమణ కాలం ముగియడానికి 2 నెలల ముందే ఆ స్థానంలోకి కొత్త న్యాయమూర్తిని ప్రతిపాదించాలని నిర్ణయించింది. న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థ్యం, నాణ్యతను పెంచడానికి ఈ విధాన నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా సీజేగా ప్రతిపాదించిన వారిని 2 నెలల ముందుగానే సంబంధిత హైకోర్టుకు బదిలీచేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. దీనివల్ల సీజేగా బాధ్యతలు చేపట్టేలోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటుపడటానికి వీలవుతుందని పేర్కొంది. అందులో భాగంగానే జస్టిస్ లిసా గిల్‌ను మొదట ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీ చేసి, ప్రస్తుత సీజే పదవీ విరమణ చేశాక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టేందుకు వీలు కల్పిస్తున్నట్లు వెల్లడించింది.

# కేంద్రం సహకరిస్తే రాజకీయ పార్టీగా మారుస్తాం

హైదరాబాద్: ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి ఒకవైపు...ఈ ప్రజాస్వామ్యం అంతా బూటకం, సాయుధ తిరుగుబాటు ద్వారానే రాజ్యాధికారం దక్కించుకోవాలని ఇటీవలి కాలం వరకు తుపాకులతో పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు మరోవైపు... వీరిరువురి చరిత్రాత్మక కలయికకు సచివాలయం వేదికైంది. డీజీపీ మొదలు పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో దాదాపు గంటపాటు వీరి మధ్య అనేక ఆసక్తికరమైన అంశాలపై శుక్రవారం చర్చ జరిగింది. లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు తమ అంతరంగాన్ని ఆవిష్కరించగా.. తన పరిధిలోని అంశాలను తప్పకుండా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉండి పోరాటం చేసిన మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ ఎలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్నలు ఇటీవల డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన సంగతి తెలిసిందే. వీరితో పాటు గతంలో లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్ ఎలియాస్ చంద్రన్న, కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మావతి ఎలియాస్ సుజాతక్క శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. దేవ్‌జీ, రాజిరెడ్డిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే సాయుధ పోరాటాన్ని విరమిస్తామన్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)ని కూడా రద్దు చేస్తామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రజా జీవితంలోనే ఉండి, చట్టపరంగా ఉద్యమ పంథా కొనసాగిస్తామని స్పష్టం చేసిన దేవ్‌జీ తాము రాజకీయంగా పురోగమించేందుకు ప్రభుత్వాలు ముఖ్యంగా కేంద్రం సహకరించాలన్నారు. ఇలా చేస్తే మావోయిస్టు పార్టీని రాజకీయ పార్టీగా మారుస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసినప్పుడు ఆయన దృష్టికి తీసుకెళ్తానని, ఆయన ఒప్పుకొంటే ఇక్కడికే పిలిపించి, సభ ఏర్పాటు చేసి ప్రకటిస్తామన్నారు.

# రాష్ట్రానికి మరో ఉక్కు కర్మాగారం

దిల్లీ: రాష్ట్రానికి మరో ఉక్కు కర్మాగారం రానుంది. అమెరికాజపాన్ సంయుక్త సంస్థ ప్రొటీరియల్... మెట్‌గ్లాస్ ఇండియా పేరుతో శ్రీసిటీలో ఎలక్ట్రికల్ స్టీల్ కర్మాగారం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ సీఈఓ సీన్ ఎం.స్టాక్ వెల్లడించారు. శుక్రవారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో ఆయన ఈ విషయం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లలో ఉపయోగించే పరికరాలను ఇందులో ఉత్పత్తి చేయనున్నారు. ఈ సంస్థ తొలిదశలో సుమారు 7780 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టి ఎల్లాయ్ రిబ్బన్‌ను ఉత్పత్తి చేయనుంది. ఈ ఏడాది చివరినుంచి ఈ సంస్థ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అధునాతన జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇందులో ఉత్పత్తి కార్యకలాపాలు చేపట్టనున్నారు. తొలిదశలో ఏడాదికి 30వేల టన్నుల సామర్థ్యంతో ప్లాంట్ పనిచేస్తుంది.

**స్థానికులకు జపాన్‌లో శిక్షణ**

ఇక్కడి ఉద్యోగాల్లో స్థానిక యువతకే ఎక్కువ అవకాశం ఇస్తామని సీఈఓ సీన్ ఎం.స్టాక్ చెప్పారు. తమ అవసరాలకు తగ్గట్టు ఉద్యోగులను ఎంపిక చేసి వారికి జపాన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. "మేం తొలి ఎలక్ట్రిక్ స్టీల్ ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో పెట్టబోతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సంస్థ ఏర్పాటుకు కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోంది. వ్యాపారం చేయడానికి అనువైన వాతావరణం అక్కడుంది. ఈ ప్లాంట్ తక్కువ విద్యుత్తు వినియోగంతో సాగుతుంది. ప్రస్తుతం భారత్ ఏటా 2226వేల టన్నుల ఎలక్ట్రిక్ స్టీల్ దిగుమతి చేసుకుంటోంది. మా ప్లాంట్‌లో తొలిదశలో 30వేల టన్నులు ఉత్పత్తి చేస్తాం. కాబట్టి దిగుమతులు తగ్గుతాయి. భారతదేశ ఆర్థిక పురోగతిని దృష్టిలో ఉంచుకొని ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఇదే మంచి సమయం అని నిర్ణయించి ఏపీలో ప్లాంట్ ఏర్పాటుచేస్తున్నాం. తొలిదశలో 7780 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నా, తర్వాత 150160 మిలియన్ డాలర్లకు తీసుకెళ్తాం. ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా రెట్టింపు చేస్తాం. తొలి దశలో 200 మందికి, మలిదశలో 500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ప్లాంట్‌లో స్టీల్ ఉత్పత్తికి మేం బొగ్గు వినియోగించం. అంతా విద్యుత్తు ఫర్నేస్ ద్వారానే జరుగుతుంది. ఇనుప ఖనిజాన్ని స్థానిక ఉత్పత్తిదారుల నుంచే సేకరిస్తాం" అని ఆయన వెల్లడించారు.

*** అమెరికా సుంకాల తగ్గింపు వల్ల ఆక్వా హబ్‌గా ఏపీ**

ఆక్వాలో దేశంలోనే మనం నంబర్ 1. ఎగుమతుల్లో మన రాష్ట్ర వాటా 34%. ఈ ఏడాది 17% వృద్ధి నమోదైంది. ఆక్వా జోన్ పెద్దఎత్తున అభివృద్ధి చేస్తాం. యూనిట్ విద్యుత్తు రూ.1.50 చొప్పున ఇచ్చి ఆక్వా రంగాన్ని పునరుద్ధరించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. దేశంలోని చేపల ఉత్పత్తిలో 29%, రొయ్యల ఉత్పత్తిలో 75% ఏపీలోనే ఉంది. అమెరికా సుంకాల తగ్గింపు వల్ల ఏపీ ఆక్వాకల్చర్ హబ్‌గా మారనుంది.

# కవితకు భారీ ఊరట

హైదరాబాద్: దిల్లీ మద్యం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై సీబీఐ అభియోగాలు నిరాధారంగా ఉన్నాయని దిల్లీ కోర్టు కొట్టివేయడంతో ఆమెకు భారీ ఊరట లభించింది. కవిత అరెస్టు నుంచీ జరిగిన పరిణామాలు అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశాలయ్యాయి. సీబీఐ అధికారులు తొలుత 2022 డిసెంబరులో హైదరాబాద్‌లోని కవిత నివాసంలో ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం.. మద్యం కేసులో కవిత తరఫున కార్యకలాపాలు సాగించారంటూ హైదరాబాద్‌కు చెందిన పలువురిని కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేశాయి. ఈడీ అధికారులు 2024 మార్చి 15న కవితను అరెస్ట్ చేసి దిల్లీలోని తిహాడ్ జైలుకు తరలించారు. ఆమె జైల్లో ఉండగానే ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. సుమారు 5 నెలల జైలు జీవితం అనంతరం.. అదే ఏడాది ఆగస్టు 27న ఆమె బెయిల్‌పై విడుదలయ్యారు.

*** అభియోగాలు.. కోర్టు స్పందించిన తీరు..**

- మద్యం కేసులో కవిత (17వ నిందితురాలు)ను కీలక కుట్రదారుగా ప్రాసిక్యూషన్ పేర్కొంది. మద్యం విధానాన్ని సౌత్ గ్రూపునకు అనుకూలంగా మార్చేందుకు రూ.100 కోట్లు వసూలు చేసి ఆమ్ ఆద్మీ పార్టీకి అప్పగించడంలో ఆమె కీలకంగా వ్యవహరించారని ఆరోపించింది. తన అనుచరులు అభిషేక్ బోయినపల్లి, అరుణ్ రామచంద్ర పిళ్లై, బుచ్చిబాబు గోరంట్ల ద్వారా దిల్లీకి చెందిన విజయ్‌నాయర్‌తో కలిసి కవిత ఈ కుట్రకు పాల్పడ్డారని వాదించింది.
- మద్యం హోల్‌సేల్ వ్యాపార సంస్థ ఇండోస్పిరిట్‌కు ప్రయోజనం చేకూర్చేలా పథకం రూపొందించడం ద్వారా కవిత లబ్ధి పొందారని పేర్కొంది. భూలావాదేవీల ద్వారా శరత్‌చంద్రారెడ్డి (23వ నిందితుడు) నుంచి రూ.14 కోట్ల లబ్ధితోపాటు.. తెలంగాణ జాగృతి సంస్థకు సీఎస్‌ఆర్ విరాళం పొందినట్లు ఆరోపించింది.

# రూ.లక్ష కోట్లతో ఉద్యాన హబ్

అమరావతి : రాయలసీమను ప్రపంచానికే నంబర్ 1 ఉద్యాన హబ్‌గా మార్చబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 40 లక్షల ఎకరాలకు సాగును విస్తరించి, 100 కోట్ల (1000 మిలియన్) టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఇక్కడ అన్ని రకాల ఉద్యాన పంటలు పండిస్తామన్నారు. దీనికి ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చు చేయనుండగా. మౌలిక సౌకర్యాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల నుంచి అదనంగా మరో రూ.70 వేల కోట్ల పెట్టుబడులొస్తాయని వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. ముఖ్యాంశాలివీ.. దేశంలో ఎక్కువ పండ్లు పండించే రాష్ట్రం ఏపీ. నంబర్ 1 స్థానంలో ఉంది. రాయలసీమలో ఉద్యాన పంటలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నాం. 20 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలతో 400 మిలియన్ టన్నుల పండ్లు, కూరగాయలు ఉత్పత్తవుతున్నాయి. దీన్ని రాబోయే రోజుల్లో రెట్టింపు చేస్తాం.

*** కౌలు రైతులు పరిమితంగా సాగు చేయాలి**

కౌలు రైతులు ఒక్కొక్కరు 30 నుంచి 40 ఎకరాలు సాగు చేస్తున్నారు. నష్టాలొచ్చినప్పుడు కోలుకోలేని స్థితికి వెళుతున్నారు. పరిమితంగా సాగు చేయాలి. వారికి అండగా నిలిచేలా అన్ని చర్యలు తీసుకుంటాం.

*** ఏలూరు వద్ద కోకో సిటీ**

బర్లీ పొగాకు, ఉల్లి, కోకో, మామిడి తదితర పంటలకు రూ.500 కోట్లు మార్కెట్ జోక్యం కింద ఇచ్చి ఆదుకున్నాం. అన్ని వాణిజ్య పంటలూ సాగు చేయాలి. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏలూరు వద్ద ప్రపంచంలోనే మొదటి కోకోసిటీ రాబోతోంది. వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యమిస్తున్నాం. టెక్నాలజీ, నాలెడ్జి అందిపుచ్చుకుంటున్నాం. ప్రతి రైతుకు ఏఐ అగ్రానమిస్ట్ సహకారం అందించేలా చర్యలు తీసుకుంటాం.

*** ఉచిత విద్యుత్తుకు రూ.13,722 కోట్లు**

రాష్ట్రవ్యాప్తంగా 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లు పనిచేస్తున్నాయి. ఈ ఏడాది 69 వేల కనెక్షన్లు అదనంగా ఇచ్చాం. 202627లో ఉచిత విద్యుత్తుకు రూ.13,722 కోట్లు కేటాయించాం. పంటలకు 1,250 టన్నుల సూక్ష్మపోషకాలు సరఫరా చేశాం. 47 లక్షల మందికి పెట్టుబడి రాయితీగా రూ.310 కోట్లు ఇచ్చాం. ధాన్యం రైతులకు 24 గంటల్లోపే డబ్బు జమ చేస్తున్నాం. రికార్డు స్థాయిలో రూ.10,876 కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,670 కోట్లు చెల్లించాం.

*** 2029 నాటికి 50 లక్షల ఎకరాలకు ప్రకృతి సేద్యం**

రాష్ట్రవ్యాప్తంగా 8,168 గ్రామాల్లో 17.77 లక్షల ఎకరాల్లో 15 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. 2029 నాటికి 50 లక్షల ఎకరాల్లో 40 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం విస్తరించేలా కార్యక్రమం చేపట్టాం. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆహారశుద్ధి రంగంలో రూ.14,232 కోట్ల పెట్టుబడులొచ్చాయి. పెద్దఎత్తున ఉపాధి వస్తుంది.

*** జాతీయ వృద్ధిరేటు కంటే మనదే ఎక్కువ**

దేశంలో వ్యవసాయ వృద్ధి రేటు 0.39% కాగా మన రాష్ట్రంలో 7.83% ఉంది. జీడీపీలో వ్యవసాయ పరంగా 10% వాటా కలిగిన ఏకైక రాష్ట్రం మనదే. వైకాపా ఐదేళ్ల పాలనలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. వారికి అండగా నిలిచేలా విభిన్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్వర్ణాంధ్ర పది సూత్రాల్లో అగ్రిటెక్ ఒకటి. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, టెక్నాలజీ, ప్రభుత్వ మద్దతు ద్వారా రైతుల్ని ముందుకు తీసుకెళుతున్నాం.

# జూన్ 2న భారీ బహిరంగ సభ

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వచ్చే జూన్ 2న భారీ బహిరంగసభ నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సర్కారు చేపట్టనున్న '99 రోజుల కార్యక్రమం' ఎజెండాపై మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం రాత్రి ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలు శాఖల ముఖ్యకార్యదర్శులు పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా, మండలం, గ్రామం.. ఇలా వివిధ స్థాయుల్లో 99 రోజుల పాటు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, వివిధ శాఖలను ఏ విధంగా సమన్వయం చేసుకోవాలనే పూర్తి సమాచారంతో కూడిన నివేదికలు రూపొందించాలని మంత్రులు సూచించారు

# అదానీ గ్రూప్‌పై అమెరికా కన్నెర్ర

న్యూఢిల్లీ : భారతదేశం నుంచి అదానీ గ్రూప్ సంస్థ ద్వారా దిగుమతి చేసుకుంటున్న సౌర ఉత్పత్తులపై అమెరికా 126 శాతం టారిఫ్ విధించింది. సబ్సిడీలపై జరుపుతున్న దర్యాప్తునకు అదానీ గ్రూపు కంపెనీలు ముంద్రా సోలార్ ఎనర్జీ, ముంద్రా సోలార్ పీవీ సంస్థలు సహకరించకపోవడంతో అమె రికా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. భారత సోలార్ మాడ్యూల్ ఉత్పత్తి సామర్థ్యం వేగంగా విస్తరిస్తున్న తరు ణంలో అమెరికా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 2024లో అమెరికాకు జరిగిన ఎగు మతుల విలువ దాదాపు రూ.6,578 కోట్లు (792.6 మిలి యన్ డాలర్లు). 20212024 మధ్య కాలంలో భారత్ నుంచి జరిగిన సోలార్ ఫొటో వాల్టాయిక్ మాడ్యూల్ ఎగుమతుల్లో 90 శాతానికి పైగా అమెరికాకే రవాణా అయ్యాయి.

**కారణం ఇదే అదానీ గ్రూప్ కంపెనీలు**

దర్యాప్తునకు సహకరించకపోవడంతో భారీగా టారిఫ్ విధిస్తున్నామని ఈ నెల 20న జారీ చేసిన ఆదేశాలలో అమెరికా వాణిజ్య శాఖ తెలిపింది. దర్యాప్తులో అదానీ గ్రూప్ కంపెనీలను 'తప్పనిసరి ప్రతివాదులు'గా చేర్చారు. అంటే కేసును పరిష్కరించాలంటే ఈ సంస్థలు విధిగా దర్యాప్తునకు హాజరు కావాల్సి ఉంటుంది. లేనిపక్షంలో తీర్పు ఇవ్వడం కుదరదు. దర్యాప్తు ప్రక్రియ నుంచి ఈ సంస్థలు వైదొలిగితే కోర్టు ఆ కేసును రద్దు చేసే అవకాశం కూడా ఉంటుంది. అదానీ గ్రూపు కంపెనీలు కేసు విచారణకు సహకరించకపోవడం తో అమెరికా వాణిజ్య శాఖ 'అందుబాటులో ఉన్న ప్రతికూల వాస్తవాల' (యాడ్ వర్స్ ఫ్యాక్ట్స్ అవైలబుల్) జరిమానాను విధించింది. తీవ్రమైన సందర్భాలలో మాత్రమే అమెరికా వాణిజ్య శాఖ ఈ వైఖరి తీసుకుంటుంది. గడువులోగా తాను కోరిన సమాచారాన్ని అందజేయడంలో అదానీ గ్రూప్ సంస్థలు విఫలమ య్యాయని, ప్రశ్నావళికి కూడా సమాధానాలు పంపలేదని వాణిజ్యశాఖ తెలిపింది.

# చంద్రబాబును కలిసిన భట్టి విక్రమార్క

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం కలిశారు. తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి సీఎంను ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. భట్టి విక్రమార్క వెంట తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు. వీరిద్దర్నీ చంద్రబాబు శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమలు అందజేశారు. అంతకుముందు రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు, ఇతర ఉన్నతాధికారుల్ని భట్టి విక్రమార్క కలిసి తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజుకు శుభలేఖ అందజేశారు. విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి దర్శించుకున్నారు.

## నారాయణ విద్యాసంస్థలు ఆధ్వర్యంలో ఘనంగా ఎస్.ఎల్.సి.



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నెహ్రూ నగర్‌లోని నారాయణ పాఠశాలలో ఈచాంప్స్ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్.ఎల్.సి.) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి మాధవ రావు రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తాము తరగతుల్లో నేర్చుకున్న పాఠాలు, ప్రాజెక్టులు, నైపుణ్యాలను తల్లిదండ్రుల సమక్షంలో ధైర్యంగా వివరిస్తూ ఆకట్టుకున్నారు. చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అభివృద్ధి చెందడం అభినందనీయమని అతిథులు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పి. నరసింహ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని డైరెక్టర్ రమాదేవి జూమ్ ద్వారా వీక్షించి అభినందించారు. ఎస్.ఎల్.సి. కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, బంగారు భవిష్యత్‌కు గట్టి పునాదిగా నిలుస్తాయని ఆమె తెలిపారు.కార్యక్రమంలో ఏజీఎం రాంకీ, కోఆర్డినేటర్ వినోద లక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయానికి గోదానం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ మండలం గుడిపాడులోగల శ్రీ మోక్ష వెంకటేశ్వరస్వామి ఆలయానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గోదానం చేశారు. ఆలయ ధర్మకర్త నల్ల సురేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్యామల గోపాలన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాన్ని పునఃప్రతిష్ఠాపన చేయాలని సంకల్పించి శ్రీదేవి, గోదా దేవి సమేత శ్రీ మోక్ష వెంకటేశ్వరస్వామి ఆలయానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి శఠకోపముని రామానుజ జీయరు స్వామి ఆశీస్సులతో వేదమంత్రోచ్ఛరణల నడుమ పునఃప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్, రమేష్ రాథోడ్ , గణేష్ మహారాజ్, బాబులాల్ నాయక్, బాలకృష్ణ, కేశవ్ నాయక్, కాన్షీరామ్ నాయక్, గుగులోత్ భద్రు నాయక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో, డోలు సన్నాయితో ఆలయానికి వెళ్లి గోవును దానం చేశారు. అనంతరం సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఆలయంతోపాటు ఇక్కడే హాతీరం, శ్రీ బాలాజీ పాచిక ఆడిన విగ్రహంతోపాటు, మంచి ఆశ్రమం కూడా నెలకొల్పుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంత్ సాధువులు గణేష్ మహారాజ్, బాధ్యా సాధువు, బాలు సాధువు, రమేష్ సాధువు, శంకర్ సాధువు, రామ్ ఫల్ సాధువు, సంపత్ సాధువు, భూక్య హుస్సేన్ నాయక్, ప్రవీణ్, సురేష్, నునావత్ కేసులాల్, తేజవత్ వెంకట్ నాయక్, వినోద్ నాయక్, చంద్రకళ బాయి, లలిత బాయి తదితరులు పాల్గొన్నారు.

## ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం – బొంతు శ్రీదేవి యాదవ్



ప్రజాస్ఫూర్తి, కాప్రా: ప్రతి వర్షాకాలంలో కుషాయిగూడ మెయిన్ రోడ్డుపై ఏర్పడుతున్న నీటి నిల్వలు, వరద ప్రవాహ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభమైనట్లు బొంతు శ్రీదేవి యాదవ్ తెలిపారు. డీమార్ట్ నుంచి కృష్ణారెడ్డి నగర్ మెయిన్ రోడ్ వరకు రూ. 3.8 కోట్ల అంచనా వ్యయంతో బాక్స్ డ్రైన్ రెండో విడత పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు.కుషాయిగూడ మెయిన్ రోడ్డులో వర్షాల సమయంలో నీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా శివ సాయినగర్ కాలనీ మరియు పరిసర కాలనీల వాసులు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆమె పేర్కొన్నారు. నాగార్జున కాలనీ రోడ్ నం.1 మార్గాన్ని ప్రత్యామ్నాయంగా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంటోందని వివరించారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సమస్యకు బాక్స్ డ్రైన్ నిర్మాణం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని, వర్షపు నీరు సక్రమంగా పారే విధంగా మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని తెలిపారు. అభివృద్ధి పనులు వేగంగా, సజావుగా పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ప్రాంతంలో నీటి నిల్వలు తగ్గి, రోడ్లపై రాకపోకలు సులభతరం కావడంతో పాటు స్థానిక ప్రజలకు గణనీయమైన ఉపశమనం కలుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## మే 21, 22 తేదీల్లో టీజీ డీఈఈసెట్ పరీక్షలు.. మార్చి 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్ కాలేజీలు, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ సంస్థల్లో రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'టీజీ డీఈఈసెట్ 2026' నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు డీఈఈసెట్ కన్వీనర్ జి. రమేష్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. డీ సెట్ రాసేందుకు కావలసిన అర్హత, సిలబస్ ఇతర సూచనలతో కూడిన పూర్తి వివరాలు మార్చి 5 నుండి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మార్చి 15 నుండి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 21, 22 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ. 450, ఇతర అభ్యర్థులకు రూ. 500 ఫీజును కేవలం ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. ఇతర వివరాలు హెల్ప్‌లైన్ నంబర్ 8317567404 ను సంప్రదించాలని కన్వీనర్ సూచించారు.

## భారతీయ హస్తకళలు ఎంతో గొప్పవి

**: సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులకు "మిమి క్రాఫ్ట్స్" లో ఉచిత శిక్షణ**







చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భారతీయ హస్తకళలు ఎంతో ప్రాచీనమైనవని, ఈ కళలకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉన్నట్లు ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ కే కృష్ణమూర్తి తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాలలో దుస్తులు డిజైన్ల తయారీ కోర్సు చదువుతున్న విద్యార్థులకు చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం టెక్స్ టైల్ పార్కులోని మిమి క్రాఫ్ట్స్ లో గురువారం ఆయన ఉచితంగా స్క్రీన్ ప్రింటింగ్, బ్లాక్ ప్రింటింగ్, బాతిక్ ప్రింటింగ్ లలో శిక్షణ ఇచ్చారు. భారతీయ హస్తకళలు ఎంతో గొప్పవని వివరించారు. పూర్వకాలం నాటి ప్రింటింగ్ పద్ధతులను నేటి తరానికి అనుగుణంగా మార్పులు చేసి ఫ్యాషన్ వస్త్రాలను రూపొందిస్తే ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని తెలిపారు. వస్త్రాలు దుస్తుల తయారీలో నిత్య నూతనంగా వ్యవహరించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజైన్లను దుస్తులను మార్పులు చేయాలని సూచనలు చేశారు. సామాజిక విజ్ఞాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీ పూజ మాట్లాడుతూ తమ కళాశాలలో పాఠాలతో పాటు క్షేత్రస్థాయిలో కార్యశాలలు ప్రత్యక్ష శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. నైపుణ్యాన్ని పెంచుకుంటే ఫ్యాషన్ డిజైనర్లుగా ఇంటర్ ప్రిన్యూర్లుగా టీచింగ్ ప్యాకెల్టీలుగా ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. మిమి క్రాఫ్ట్స్ నిర్వాహకురాలు పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నార్కట్‌పల్లి పట్టణ పరిధిలోని నల్లగొండ చౌరస్తా జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బండల లారీ వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న మెడికల్ షాప్ దుకాణంలోకి దూసుకెళ్లిన ప్రమాద ఘటనపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుక్రవారం ఉదయం ప్రమాద స్థలాన్ని ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలను అధికారుల ద్వారా తెలుసుకుని, సీసీ కెమెరా పుటేజీలు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేయాలని ఆదేశించారు. ఎస్పీ ఘటన స్థలంలో ఉన్న రోడ్డు నిర్మాణం, ట్రాఫిక్ నియంత్రణ పరిస్థితులు, హెచ్చరిక బోర్డుల లేమి తదితర అంశాలను పరిశీలించి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత రోడ్డు సేఫ్టీ అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు పెంచడం, రాత్రి వేళల్లో మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షణ పెంచడం వంటి చర్యలను తక్షణం అమలు చేయాలని ఆర్&బి అదికారులను ఆదేశించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ గారు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, రాత్రి వేళల్లో జాగ్రత్తగా వాహనాలు నడపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఎస్పీ గారి వెంట డీఎస్పీ నల్లగొండ శివరాం రెడ్డి, ఎస్.ఐ విష్ణు, స్థానిక సర్పంచ్ భరత్ మరియు ఇతర పోలీసు అధికారులున్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...

* **యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి వినయ్‌గౌడ్**
* **కళ్యాణలక్ష్మి, షాదిముబార్ చెక్కుల పంపిణీ**



అందోలు, ప్రజాస్ఫూర్తి : పేదల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి వినయ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వట్‌పల్లిలోని రైతువేదిక భవనంలో 54 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, గృహజ్యోతి, రూ.500లకే గ్యాస్ సిలెండర్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, సన్నాలకు రూ.500 బోనస్, ఆరోగ్యశ్రీ రూ.10లక్షలకు పెంపు వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేదల పేదరికాన్ని నిర్మూలించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. గడిచిన రెండేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముందుకు వెళుతుందన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయితీ, మున్సిపాలిటీల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలుపొందడం కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న విశ్వాసం బయటపడిందన్నారు. రాబోయే జెడ్పిటీసీ, ఎంపిటీసీ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంపై ఉన్న ప్రజా విశ్వాసం పట్ల పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో అధికారంలో ఉండడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మెన్ కచూర్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు రమేశ్‌జ్యోషి, ఏయంసీ వైస్ చైర్మెన్ ఈశ్వరయ్య, డైరెక్టర్ దిగంబర్‌రావు, సర్పంచ్ రవీందర్, విశ్వాస్, మాజీ సర్పంచ్ శివచరణ్, యువజన కాంగ్రెస్ మండల అద్యక్షుడు వెంకట్‌పాటిల్, మాజీ అద్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు అశోక్‌గౌడ్, ప్రశాంత్,వీరారెడ్డి, శివశంకర్, సుధాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారమే ఎర్రజెండా ధ్యేయం

* **కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్‌కు అభినందనలు**
* **గుజ్జుల ఈశ్వరయ్య**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విజయవాడ నగరంలో రానున్న ఎన్నికల్లో ఎర్రజెండా ఎగరేసేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ ప్రథమ మేయర్‌గా ఎన్నికైన మూడ్ గణేష్ అభినందన సభ విజయవాడ దాసరి భవన్‌లో సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది.ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ, ఇటీవల తెలంగాణలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్తగూడెం నగర పాలక సంస్థలో సిపిఐ ఒంటరిగా పోటీచేసి 22 డివిజన్లను గెలుచుకుని మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఆటో డ్రైవర్ స్థాయి నుండి మేయర్‌గా ఎన్నికైన మూడ్ గణేష్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఒక సాధారణ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తను మేయర్‌గా చేయగలిగిన సత్తా కమ్యూనిస్టు పార్టీకే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలతో మమేకమై పనిచేసే వారిని ప్రజలు ఎప్పటికీ ఆదరిస్తారనే విషయం మరోసారి రుజువైందన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల విజయంలో కీలక పాత్ర పోషించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మరియు పార్టీ శ్రేణులను అభినందించారు. ధనస్వామ్య రాజకీయాలు ఏలుతున్న ఈ సమయంలో కమ్యూనిస్టుల గెలుపు స్ఫూర్తిదాయకమన్నారు. రానున్న నగర కార్పొరేషన్ ఎన్నికల్లో విజయవాడ నగరపాలకసంస్థపై సిపిఐ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ, ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం చేసిన పోరాటాలే ఈ విజయానికి మార్గదర్శకమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు పి. చంద్రనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య నాయకులు దస్తూర్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు తదితరులు పాల్గొన్నారు

## మండల స్థాయి బాల మేళా 2.0 విజయవంతం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చంద్రుగొండ, రేపల్లెవాడ, పోకులగూడెం కాంప్లెక్స్‌లలో బాల్ మేళా 2.0 కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి సురయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.లైబ్రరీ,స్టోరీ టెల్లింగ్ విభాగాల్లో ఎంపికైన విద్యార్థులను మండల స్థాయికి పంపించారు.మూడు సబ్జెక్టుల్లో మొదటి స్థానం సాధించిన వారికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. హెచ్‌ఎం లు ఉప్పల్ రెడ్డి, రామచందర్,అసిస్టెంట్ సెక్రటరీస్ తేజావత్ శ్రీరాములు,రామకృష్ణ, ఆర్పిలు వీరన్న,చందులాల్, రవి కిరణ్ కుమార్ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## కవితకు ఉపశమనం... రౌస్ అవెన్యూ కోర్టు సంచలన తీర్పు

* **ఢిల్లీ, తెలంగాణ భవన్‌లో జాగృతి సంబరాలు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కల్వకుంట్ల కవితపై సీబీఐ నమోదు చేసిన కేసులను కొట్టివేస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ పరిణామంతో జాగృతి శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. దేశ రాజధాని న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్లో డాక్టర్ అంబేద్కర్ తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాగృతి అధ్యక్షుడు డి. వీరన్న ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. మిఠాయిలు పంచుకుంటూ 'జై తెలంగాణ.. జై జాగృతి.. కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. కేసులు రాజకీయ కక్షసాధింపులో భాగమని, న్యాయం గెలిచిందని జాగృతి నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా జాగృతి ఆధ్వర్యంలో సంబరాలు కొనసాగుతున్నాయి.

## సాయి దామంలో బజరంగ్ దళ్ శిక్షణ వర్గ ఏర్పాట్లపై సమీక్ష



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సాయి దామంలో మార్చి 7 నుంచి 14 వరకు నిర్వహించనున్న అఖిలభారత బజరంగ్ దళ్ శిక్షణ వర్గం (శిబిరం) ఏర్పాట్లపై శుక్రవారం సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా అఖిలభారత బజరంగ్ దళ్ జాతీయ అధ్యక్షుడు కిషన్ ప్రజాపతి కుషాయిగూడకు విచ్చేసి శిబిర ఏర్పాట్లను పరిశీలించి, స్థానిక నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ బస్ స్టాప్ సమీపంలో నిర్మాణంలో ఉన్న 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని సందర్శించి ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం శివాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, నేటి యువత ధర్మ మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండించారు. 'లవ్ జిహాద్' పేరుతో జరుగుతున్న సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హిందువులను కులాల వారిగా విభజించి ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ,హిందువులంతా సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత్ బజరంగ్ దళ్ సంయోజక్ కుమారస్వామి, తెలంగాణ విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు రమేష్ బాబు, తెలంగాణ రాష్ట్ర బజరంగ్ దళ్ సంయోజక్ శ్రీకాంత్, భాగ్యనగర్ సంయోజక్ విశాల్, కుషాయిగూడ ప్రఖండ ప్రముఖ సాకేత్ అరుణ్, యశ్వంత్ సాగర్, రాగిరి వరుణ్ సాకేత్, బీజేపీ నాయకులు చల్ల ప్రబాకర్, సురేందర్ గౌడ్, ఆనంద్ గౌడ్, రేగొండ వెంకులు, లక్ష్మణ్ గౌడ్, గణేష్ గౌడ్, వెంకటాచలం, జీవీఎన్ రావు, సంపత్ రావు, సహదేవ్ గౌడ్, పిట్టల రాజు, దయానంద్, అప్పి, శ్రీకాంత్, శ్రీధర్, సోమేశ్ నాయుడు, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్‌లో మౌలిక వసతుల బలోపేతం

* **రూ.30 లక్షల సీసీ రోడ్ పనులకు శ్రీకారం..**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి నియోజకవర్గం, ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్‌లో లైఫ్ హాస్పిటల్ సమీపంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మైనంపల్లి హనుమంతరావు సూచనల మేరకు మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా వై. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, ప్రాంత ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. వర్షాకాలంలో రోడ్డు దెబ్బతినకుండా, నీటి నిల్వ సమస్యలు రాకుండా నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ అసోసియేషన్ సభ్యులు నారాయణ, శ్రీనివాస్ రెడ్డి, ముత్యం రెడ్డి, జాన్, కాశి రెడ్డి, వైబీఆర్‌కే ప్రసాద్, పద్మావతి, మల్లేష్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్ తదితరులు హాజరయ్యారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు జంగాల పెంటయ్య యాదవ్ కు ఘన నివాళి




మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి నియోజకవర్గం మీర్జాలగూడలో స్వాతంత్ర్య సమరయోధుడు జంగాల పెంటయ్య యాదవ్ వారి విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు. ఆయన పుత్రుడు జంగాల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ సమాజం కోసం, దేశం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత.స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు , యాదవ సంఘం నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకోవడం స్వాతంత్ర్య పోరాటంలో , నిజాం వ్యతిరేక పోరాటంలో ఆయన చేసిన సాహసోపేతమైన పనులను నెమరువేసుకొవలన్నారు. నేటి యువతకు ఆయన జీవితం ఒక స్ఫూర్తి అని, సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. తదుపరి అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలొ రామారావు యాదవ్, క్రాంతి యాదవ్, సంతోష్ రాందాస్ , (ఉద్యమకారుడు), శ్రీరామ్ యాదవ్ రషీద్ జంగాల వెంకటేష్ యాదవ్ జంగాల శివశంకర్ యాదవ్ శ్రీలత విజయలక్ష్మి వసంత మాధవి జానకి , కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ తొలి రూరల్ ఏఐ ల్యాబ్‌కు జాతీయ గుర్తింపు




హైదరాబాద్ : తెలంగాణలో తొలి రూరల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ల్యాబ్ ఏర్పాటు చేసినందుకు టీఫైబర్ సంస్థకు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. టెక్నాలజీ రంగానికి చెందిన సంస్థ టెక్నాలజీ సభ నిర్వహించిన అవార్డుల్లో ఏఐ కేటగిరీలో టీఫైబర్ ఈ పురస్కారం అందుకుంది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రకటించారు. టీఫైబర్ సంస్థ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ పి.వేణు ప్రసాద్ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అంతరాన్ని తగ్గించి, హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందించడమే టీఫైబర్ లక్ష్యమని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దూరదృష్టితో రాష్ట్రంలో డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌కు టీఫైబర్ కీలక వేదికగా మారిందని పేర్కొన్నారు. రూరల్ ఏఐ ల్యాబ్ ద్వారా గ్రామీణ యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీలపై శిక్షణ అందిస్తూ కొత్త అవకాశాలను సృష్టించడమే లక్ష్యమని టీఫైబర్ ఎండీ తెలిపారు.

# నిమ్స్‌కు జాతీయ స్థాయి పురస్కారం




నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) మరో ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని దక్కించుకుంది. న్యూఢిల్లీలో కేంద్ర ఆరోగ్య పరిశోధన విభాగం ఆధ్వర్యంలో జరిగిన 'మెడికల్ కాలేజెస్ రీసెర్చ్ కనెక్ట్-2026' సదస్సులో నిమ్స్‌కు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ పురస్కారం లభించింది. దేశవ్యాప్తంగా 100కు పైగా మెడికల్ కాలేజీలు పాల్గొన్న ఈ సదస్సులో, మల్టీడిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ల పనితీరు ఆధారంగా నిమ్స్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఐసిఎంఆర్ డైరెక్టర్ జనరల్ డా. రాజీవ్ బహల్ చేతుల మీదుగా నిమ్స్ ప్రతినిధులు ప్రొఫెసర్ పద్మజ, ప్రొఫెసర్ విజయ్ కుమార్ ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ.. ఈ గుర్తింపు తమ పరిశోధకుల అంకితభావానికి నిదర్శనమని, భవిష్యత్తులో బయోమెడికల్ పరిశోధనల్లో మరిన్ని ఉన్నత ప్రమాణాలు నెలకొల్పుతామని హర్షం వ్యక్తం చేశారు. నిమ్స్ డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్ పరిశోధక బృందాన్ని అభినందించారు.

# శిశువు మృతి ఘటనపై మల్కాజ్‌గిరిలో ఆవేదన ర్యాలీ..

* **సమగ్ర దర్యాప్తుతో న్యాయం చేయాలని డిమాండ్..**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలో రెండు నెలల శిశువు మృతి చెందిన సంఘటనపై మల్కాజ్‌గిరిలో తీవ్ర ఆవేదన వ్యక్తమైంది. శుక్రవారం రాత్రి బీసీ, ఎస్సీ కులాల నాయకులు బత్తిని నరసింహ గౌడ్, కాసర్ల నాగరాజు ఆధ్వర్యంలో అనుటిక్స్ చౌరస్తా నుండి మల్కాజ్‌గిరి చౌరస్తా వరకు కొవ్వొత్తులతో నిశ్శబ్ద నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జాతర సమయంలో గ్రామంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు ఘర్షణకు దారితీసినట్లు తెలిపారు. ఆ సంఘటనలో పసిపాప ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఘటనపై వేగవంతమైన, పారదర్శక దర్యాప్తు చేపట్టి నిజానిజాలు వెలికితీయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ పూర్తి చేసి నిందితులకు శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కరుణం గోపి, టి.ఎన్. కృష్ణ, జీనుకుంట్ల రమేష్‌గౌడ్, జీ.డి. బాలచందర్, జీ.డి. నవీన్ గౌడ్, పి. రామకృష్ణ, బక్క నాగరాజు, నర్సింగరావు, కె. సంపత్, గౌతం రాజు, పి. సత్యనారాయణ, ఎం. శ్రీనివాస్, నరహరి గౌడ్, వీరస్వామి, డి. రాజు, శ్రీనివాస్, దర్శనం తదితరులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మంత్రి కి వినతి



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : డబల్ బెడ్ రూమ్లలో నివాసముండే ప్రజలపై భారం పడుతున్న ఐదు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకోని వెళ్లారు అందులో మరుగు నీటికి సంబంధించిన యస్ టీ పి వలన నెలకు సుమారు ఐదు నుండి ఆరు లక్షలు వేచించాల్సిన బరువు ప్రజలపై పడుతుంది కావున డ్రైనేజ్ వ్యవస్థాలో యస్ టీ పి కలిపేయండి, లిఫ్ట్ లకు సంబంధించిన ఏ ఏం సి ప్రస్తుతం ప్రభుత్వంమే ఏ ఏం సి చూస్తుంది కాని చాలామటుకు లిఫ్ట్ పనిచేయడం లేదు ఇపుడు ఏ ఏం సి ప్రజలపై వేస్తే సుమారు లక్ష నుండి మూడు లక్షల ఖర్చు ప్రజలపై పడే అవకాశం వుంది కావున లిఫ్ట్ సంబందించిన కాంట్రాక్టర్ సరిగా లిఫ్ట్ మరమ్మతులు చేసి అవి పనిచేసే విధంగా మరమ్మతులు ముగిసాకా ప్రజలకు అందించండి , డిజిల్ జెనరేటర్స్ చాల ప్రాంతాలకు జెనరేటర్స్ రాలేదు ప్రభుత్వం మాత్రం సంబంధిత కాంట్రాక్టర్ లకు బిల్స్ చెలించేసారు కావున త్వరగా జెనరేటర్స్ వొచ్చే విధంగా చేయండి, బిల్డింగ్ పై పెచ్చులు దాదాపు అని డబల్ బెడ్ రూమ్ సముదయాలలో బిల్డింగ్ పై పెచ్చులు పడుతున్నాయి ఈయొక్క తాపీదాం ప్రజలది కాదు సంబంధిత కాంట్రాక్టర్లది అలాగే డిపార్ట్మెంట్ వారిది కావున ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రజలపై భారం పడకుండా చూడాలి అలాగే మురహరిపల్లి డబల్ బెడ్ రూమ్ అలాస్యం గురించి వివరించడం జెరిగింది.సమస్యలు విన్న మంత్రి త్వరలో మా నుండి మీకు సమాధానం ఫోన్ రూపంలో పంపిస్తాము అని చెప్పడం జెరిగింది. ఈయొక్క కారిక్రమానికి జె ఏ సి ప్రెసిడెంట్ అయిన సందీప్, చర్లపల్లి డైరెక్టర్ అయిన జంగీర్ పాషా అలాగే చర్లపల్లి లబ్దిదారుడు పాల్గొనడం జెరిగింది.


# మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆఫ్ అర్బన్ బయో సిటీగా సునంద రెడ్డి



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆఫ్ అర్బన్ బయో సిటీగా సునంద రెడ్డి నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ గతంలో జిహెచ్ఎంసి పరిధిలో ఉండేది, కానీ తెలంగాణ ప్రభుత్వం జిహెచ్ఎంసిను మూడు భాగాలుగా విభజించరు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది మున్సిపల్ కార్పొరేషన్‌లో 3 జోన్లు, 14 సర్కిళ్లు, 74 వార్డులు ఉన్నాయి.సునంద రెడ్డి నేతృత్వంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆఫ్ అర్బన్ బయో సిటీ గా బాధ్యతలు స్వీకరించడం ఒక కీలకమైన పరిణామం.ముఖ్యంగా నగరాల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడానికి, పచ్చదనాన్ని మెరుగుపరచడానికి , పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ఈ పదవి చాలా కీలకమైనది అని తెలిపింది వారి ఆధ్వర్యంలో మల్కాజిగిరి ప్రాంతం మరింత పర్యావరణ హితంగా మారుతుందని ఆశించవచ్చున్నారు.

# రవీంద్రభారతి బుకింగ్ ఇక ఆన్‌లైన్..

## వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు




హైదరాబాద్ : కళాకారులు, సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు రవీంద్రభారతి స్లాట్ల కోసం ఇకపై కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. పారదర్శకతను పెంచుతూ, ఇంటి నుండే స్లాట్లను బుక్ చేసుకునేలా రూపొందించిన నూతన వెబ్‌సైట్‌ను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతికత ద్వారా బుకింగ్ ప్రక్రియను మరింత సరళతరం చేశామని తెలిపారు. నిర్వాహకులు వెబ్‌సైట్‌లో తేదీల లభ్యతను స్వయంగా చూసుకుని, నగదు చెల్లించి స్లాట్ రిజర్వ్ చేసుకోవచ్చని వివరించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా మెయిన్ హాల్ (1036 సీట్లు), మినీ హాల్ (120 సీట్లు) మరియు లఘు చిత్రాల ప్రదర్శన కోసం కేటాయించిన పైడి జయరాజ్ థియేటర్లను బుక్ చేసుకోవచ్చు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అని మూడు స్లాట్లు అందుబాటులో ఉంటాయని, 90 రోజుల ముందే బుకింగ్ చేసుకునే వీలుందని అధికారులు వెల్లడించారు. ఒకవేళ కోరుకున్న తేదీ ఖాళీ లేకపోతే వెయిటింగ్ లిస్ట్ సౌకర్యం కూడా కల్పించారు. కేవలం నిర్వాహకులకే కాకుండా, ప్రతిరోజూ అక్కడ జరిగే కార్యక్రమాల వివరాలను కళాభిమానులు తెలుసుకునేలా వెబ్‌సైట్‌లో సమాచారాన్ని పొందుపరిచారు.

# ఖమ్మంలో ఇళ్ల కూల్చివేతపై హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో ఫిర్యాదు




ఖమ్మం: ఖమ్మం నగర శివార్లలోని వెలుగుమట్ల ప్రాంతంలోని వినోబా నవోదయ కాలనీలోని నిర్మించిన ఇళ్ల కూల్చివేతలపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కేసు నమోదైంది. ఈ విషయంలో ఫిర్యాదును స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్సీ దర్యాప్తు చేపనట్టనుందని ఫిర్యాదు దారు, అడ్వకేట్ ఇమ్మనేని రామారావు తెలిపారు. వెలుగుమట్ల గ్రామంలో గల భూదాన్ భూములపై గతంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్టేటస్ కో విధించిదని పేర్కొన్నారు. భూదాన్ ప్రాథమిక ఉద్దేశ్యం పేదలకు భూములు, పేదలు ఇల్లు కట్టుకున్న భూములపై నిషేధం లేదని తెలిపారు. దాదాపు 6 వందల పేదల ఇళ్లు కూలగొడుతూ విధ్వంసం సృష్టించిన కలెక్టర్ అనుదీప్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిపై చర్యలు తీసుకొనే విధంగా రాష్ట్ర సీఎస్‌కు ఆదేశాలు ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఆర్‌సి ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలంటూ కోరారు. వివాదాస్పద భూమి విలువ బాగా పెరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో జిల్లా మంత్రికి సన్నిహితులుగా ఉన్న కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వినోబా కాలనీ సమీపంలో రియల్ ఎస్టేట్ వెంచర్‌లు చేస్తున్నారని అందువల్ల ఇళ్ల కూల్చివేత జరిగిందని ఆరోపిస్తూ ఫిర్యాదులో వివరించారు.

# చిక్కెన్ వింగ్ ఫ్రైస్ కార్నర్ ప్రారంభం



మల్కాజిగిరి ప్రజాస్ఫూర్తి : సైనిక్‌పురి నుండి వాయుపురి సిగ్నల్ వెళ్తుండగా . నూతనంగా ప్రారంభించిన రెస్టారెంట్ ఈ రెస్టారెంట్‌లో ఫ్రైడ్ చికెన్, వింగ్స్, ఫ్రైస్ వంటి ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. ఈ రెస్టారెంట్‌ను బోడిగం శ్రీనివాస్ గౌడ్ మల్కాజిగిరి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేతులు మీదుగా ప్రారంభించారు. బోడిగం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నాణ్యత గల ఆహార పదార్థాలను ప్రజలకు వినియోగదారులకు కస్టమర్లకు అందించాలని కోరుతున్నాను అంటూ తెలిపారు.

# మున్సిపల్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు

* **మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పై సీఎం రేవంత్ సమీక్ష**
* **దోమల నివారణ, చెత్త సేకరణపై సూచనలు**
* **హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతపై కీలక ఆదేశాలు**



హైదరాబాద్ : ఇటీవల కాలంలోనే మున్సిపల్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. మున్సిపాలిటీల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఫోకస్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఇందులో భాగంగానే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. కోర్ అర్బన్ ఏరియాలో పారిశుద్ధ్యం, దోమల నివారణ, చెత్త సేకరణపై ఈ సందర్భంగా కీలక ఆదేశాలు ఇచ్చారు. వాటి నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. దోమల నివారణకు ప్రత్యేక టెక్నాలజీ వాడాలన్నారు. స్ట్రీట్ లైటింగ్ నిర్వహణకు సాంకేతికతను అనుసంధానం చేయాలని తెలిపారు. సమస్య తలెత్తినప్పుడు తక్షణం పరిష్కరించేలా కంట్రోల్ రూంతో అనుసంధానం చేయాలని ఆదేశించారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. నగరంలో హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత పర్యవేక్షణను పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఆహార నాణ్యతను పాటించే విషయంలో హోటళ్లు, రెస్టారెంట్లకు గ్రేడింగ్ ఇచ్చే అంశాన్ని ఆలోచన చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నగరంలోని వాణిజ్య సముదాయాలు, వ్యాపార సముదాయాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.

# దానం నాగేందర్ అనర్హత పిటిషన్ విచారణలో ట్విస్ట్.. హాజరుకాని దానం, మార్చి 2కి వాయిదా



హైదరాబాద్ : ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణలో భాగంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్లను అసెంబ్లీ స్పీకర్ శుక్రవారం విచారించారు. దానం పార్టీ మారారని ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిలు దాఖలు చేసిన పిటిషన్లపైన స్పీకర్ ఛాంబర్‌లో విచారణ జరిగింది. అయితే, ఈ విచారణకు దానం నాగేందర్ గైర్హాజరు అయ్యారు. దానం తరుపు న్యాయవాదులను పిటిషనర్ల తరుపు అడ్వకేట్లు క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ఆధారాలకు సంబంధించిన అఫిడవిట్ లను దానం న్యాయవాదులు దాఖలు చేయలేదని తెలిసింది. తదుపరి విచారణను మార్చి 2వ తేదీకి స్పీకర్ వాయిదా వేశారు.

**కడియం పిటిషన్‌పై విచారణ**

ఆ విచారణను స్పీకర్ ముందు ఇరువర్గాలు తమ వాదనలు మౌఖికంగా వినిపించనున్నారు. శనివారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విచారణ చేపట్టనున్నారు. కడియం పిటిషన్ విచారణతో పది మందిపైన దాఖలైన పిటిషన్లను స్పీకర్ విచారించినట్లు అవుతుంది. కాగా, ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను విచారించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వాటిని ఇటీవల కొట్టి వేశారు. ప్రస్తుతం దానం, కడియంల పిటిషన్ల విచారణను స్పీకర్ కొనసాగిస్తున్నారు. ఈ విచారణ సందర్భంగా అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

# చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సౌందరరాజన్ మరణం విచారకరం: సీఎం చంద్రబాబు

* చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు ఎంవీ సౌందరరాజన్ కన్నుమూత
* ఆయన మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర సంతాపం
* ఆలయాల సంప్రదాయాలను కాపాడేందుకు సౌందరరాజన్ జీవితాంతం కృషి చేశారని కితాబు

హైదరాబాద్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిలుకూరు బాలాజీ ఆలయ వంశపారంపర్య ప్రధాన అర్చకుడు ఎం.వి. సౌందరరాజన్ (90) మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆలయాల సంప్రదాయాలను, వాటి స్వతంత్రతను కాపాడేందుకు సౌందరరాజన్ జీవితాంతం కృషి చేశారని, ఆయన అందించిన ఆధ్యాత్మిక సేవలు చిరస్మరణీయమని చంద్రబాబు కొనియాడారు. గత కొంతకాలంగా



వయోభారంతో కూడిన అనారోగ్యంతో బాధపడుతున్న సౌందరరాజన్, హైదరాబాద్ శివారు చిలుకూరులోని తన నివాసంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆధ్యాత్మికవేత్తగానే కాకుండా, ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా, రిజిస్ట్రార్‌గా కూడా సేవలు అందించి విద్యావేత్తగా చెరగని ముద్ర వేశారు. ప్రభుత్వ నియంత్రణను వ్యతిరేకిస్తూ ఆలయాల స్వయంప్రతిపత్తి కోసం ఆయన చేసిన పోరాటం తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇందులో భాగంగా 1998లో చిలుకూరు ఆలయంలో హుండీని తొలగించి సంచలనం సృష్టించారు. "సౌందరరాజన్ మరణం విచారకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని చంద్రబాబు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. సౌందరరాజన్ కుమారుడు సీఎస్ రంగరాజన్ ప్రస్తుతం చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగుతున్నారు.

## బొత్స అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను: పవన్ కల్యాణ్

* బొత్స త్వరగా కోలుకోవాలన్న పవన్ కల్యాణ్
* ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థన

ఓ ప్రకటన విడుదల చేసిన డిప్యూటీ సీఎం వైసీపీ మాజీ మంత్రి, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు వార్తలు రావడం తెలిసిందే. దీనిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. "శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ త్వరగా ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తున్నాను. బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు




అందించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను" అని తన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఏపీకి మరో భారీ పరిశ్రమ.. దేశంలోనే తొలి ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్

* ఏపీకి రానున్న దేశంలోనే తొలి అమోర్ఫోస్ ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్
* తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.1350 కోట్ల పెట్టుబడి
* అమెరికా-జపాన్ సంయుక్త సంస్థ ప్రొటీరియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు
* 2026 అక్టోబర్ నాటికి ఉత్పత్తి ప్రారంభం లక్ష్యం
* ఈ ప్రాజెక్టుతో సుమారు 200 మందికి ప్రత్యక్ష ఉపాధి

ఏపీ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. దేశంలోనే మొట్టమొదటి అమోర్ఫస్ ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయనున్నారు. అమెరికాజపాన్ దేశాలకు చెందిన ప్రొటీరియల్ అనే సంయుక్త సంస్థ ఈ ప్రాజెక్టును తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో స్థాపించనుంది. రూ.1350 కోట్ల భారీ పెట్టుబడితో 'మెట్‌గ్లాస్ ఇండియా' పేరుతో ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ స్టీల్ ప్లాంట్‌ను ప్రొటీరియల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్నారు.



ఇక్కడ అత్యాధునిక జపాన్ టెక్నాలజీని ఉపయోగించి అల్లాయ్ రిబ్బన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా సుమారు 200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలిదశలో ఏటా 30 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం 2026 అక్టోబర్ నాటికి పూర్తి చేసి, కార్యకలాపాలు ప్రారంభిస్తామని ప్రొటీరియల్ సంస్థ సీఈవో శాన్‌స్టాక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాల వల్లే తాము ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ స్టీల్ ప్లాంట్ రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నారు.

## వైవీ సుబ్బారెడ్డి భారీగా సంపాదించారు

* లడ్డూ వ్యవహారంలో సుబ్బారెడ్డి ఎంత సంపాదించారో తనకు తెలియదన్న బాలినేని
* సుబ్బారెడ్డిని అరెస్ట్ చేస్తే ఎక్కువ సంతోషించే వ్యక్తి తానేనని వ్యాఖ్య
* తన కుమారుడిని వివాదాల్లోకి లాగుతున్నారని ఆవేదన

టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిపై మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలుచేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో వైవీ సుబ్బారెడ్డి ఎంత సంపాదించారో తనకు తెలియదు కానీ, ఇతర అంశాల్లో మాత్రం



భారీగా వెనకేశారని బాలినేని ఆరోపించారు. వైవీ సుబ్బారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో వేస్తే, అందరికంటే ఎక్కువగా సంతోషించే మొదటి వ్యక్తిని తానే అని అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు వెల్లడించారు. తన రాజకీయ ప్రత్యర్థులు తన కుమారుడిని వివాదాల్లోకి లాగుతూ తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఒంగోలులో రెండుసార్లు ఓడిపోవడానికి కూటమి బలంగా ఉండటమే కారణమని విశ్లేషించారు. గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళల నగదును కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలినేని డిమాండ్ చేశారు. ఆ నిధులు కాజేసిన వైసీపీ నేతల పేర్లను బయటపెట్టి, వారిపై విచారణ జరిపించాలని కోరారు.

## ఏపీ నూతన సీఎస్‌గా సాయిప్రసాద్.. ఎంటెక్ నుంచి సీఎస్ వరకు ప్రస్థానం

* నేటితో ముగుస్తున్న విజయానంద్ పదవీ కాలం
* కొత్త సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించనున్న సాయిప్రసాద్
* సాయిప్రసాద్ 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి. సాయిప్రసాద్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ప్రస్తుత చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ పదవీ కాలం నేటితో (ఫిబ్రవరి 28) ముగియనుంది. ఈ నేపథ్యంలో, విజయానంద్ స్థానంలో



సాయిప్రసాద్ ను నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రేపు ఉదయం సచివాలయంలో కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్ బాధ్యతలను స్వీకరిస్తారు. 1991 బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి జి. సాయిప్రసాద్ 'ఎంటెక్' చదివారు. సివిల్ సర్వీసులోకి ప్రవేశించి 1992లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 1993-95 మధ్య పాడేరు అసిస్టెంట్ కలెక్టర్‌గా గిరిజన ప్రాంతాల్లో సేవలందించారు. 1995 నుంచి 1997 వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా... 1997-98 మధ్య కాలంలో కడప జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2000 నుంచి 2003 వరకు కర్నూలు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. సాయి ప్రసాద్ విద్యుత్ రంగం, గృహనిర్మాణ రంగాల్లో కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ ఎండీ, ఈపీడీసీఎల్ సీఎండీ, ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ, ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా సేవలందించారు. 2011 నుంచి 2014 వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖలో సంయుక్త కార్యదర్శిగా కూడా పనిచేశారు. సాయిప్రసాద్ 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత సోలార్ పవర్ కార్పొరేషన్ సీఎండీగా, ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2024 నుంచి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ ఇప్పుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు.



## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో స్పీకర్‌ను కలిసిన మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్ బాబు

* మర్యాదపూర్వకంగా సభాపతిని కలిసిన తెలంగాణ మంత్రులు
* మార్చి 5న జరగనున్న కుమారుడి వివాహానికి ఆహ్వానించిన భట్టివిక్రమార్క
* అంతకుముందు, కనకదుర్గమ్మను దర్శించుకున్న భట్టివిక్రమార్క


ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అయ్యన్నపాత్రుడిని కలిశారు. ఈ సందర్భంగా తన కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహానికి రావాల్సిందిగా భట్టి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వారు కాసేపు ముచ్చటించుకున్నారు. కాగా, మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో భట్టివిక్రమార్క తనయుడి వివాహం జరగనుంది. అంతకుముందు, ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉదయం మల్లు భట్టివిక్రమార్క బెజవాడ కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం భట్టివిక్రమార్కకు పండితులు వేదాశీర్వచనం అందించారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

## కర్నూలు నర్సింగ్ కాలేజీలో కశ్మీరీ విద్యార్థినులపై వేధింపులు.. సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు

* సీఎం చంద్రబాబు జోక్యం కోరుతూ జేకే స్టూడెంట్స్ అసోసియేషన్ లేఖ
* రంజాన్ ఏర్పాట్లు, హిజాబ్‌పై ఆంక్షలు విధించారని ఆరోపణ
* 'ఉగ్రవాదులు' అంటూ దూషిస్తున్నారని విద్యార్థినుల ఆవేదన
* నిష్పక్షపాత విచారణ జరిపి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి

కర్నూలులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న కశ్మీరీ విద్యార్థినులపై వేధింపులు జరుగుతున్నాయని, ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని జమ్మూ కశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ (జేకేఎస్ఏ) ఏపీ సీఎం చంద్రబాబును కోరింది. రంజాన్ మాసంలో ప్రత్యేక ఏర్పాట్లు నిరాకరించడం, హిజాబ్ ధరించవద్దని ఒత్తిడి చేయడం, మాటలతో దూషించడం వంటివి చేస్తున్నారని ఆరోపిస్తూ ఇవాళ సీఎంకు లేఖ రాసింది. జేకేఎస్ఏ జాతీయ కన్వీనర్ నాసిర్ ఖుహెమీ తెలిపిన వివరాల ప్రకారం... కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న దాదాపు 24 మంది కశ్మీరీ విద్యార్థినులు ఈ ఫిర్యాదులు చేశారు. వీరిలో చాలామంది ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ స్కీమ్ (పీఎంఎస్ఎస్) కింద చదువుతున్న యువతులే. రంజాన్





మాసంలో సెహ్రీ, ఇఫ్తార్ కోసం ఏర్పాట్లు చేయమని కోరగా, "మతపరమైన ఆచారాలు పాటించాలనుకుంటే కాలేజీలో ఎందుకు చేరారు?" అని యాజమాన్యం ప్రశ్నించిందని విద్యార్థులు ఆరోపించారు. తమ కశ్మీరీ గుర్తింపు, మతం ఆధారంగా లక్ష్యంగా చేసుకుని వివక్ష చూపుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 'ఉగ్రవాదులు', 'ఇడియట్స్' వంటి పదజాలంతో దూషిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హిజాబ్ తొలగించాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇది తమ ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని జేకేఎస్ఏ తెలిపింది. ఈ ఘటనల వల్ల విద్యార్థినులు భయం, అవమానంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఇది వారి చదువుపై ప్రభావం చూపుతోందని వివరించింది. ఈ విషయంపై తక్షణమే స్పందించి, నిష్పక్షపాత విచారణకు ఆదేశించాలని చంద్రబాబును జేకేఎస్ఏ కోరింది. విద్యార్థినుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించాలని, భయం లేకుండా చదువుకునే వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. విద్యాసంస్థలు అందరికీ సురక్షితమైన ప్రదేశాలుగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొంది.

## వైకాపా నేత బొత్స సత్యనారాయణకు బ్రెయిన్ స్ట్రోక్

అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు గురువారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. శుక్రవారం తెల్లవారుజామున అక్కడి సిటీ న్యూరో సెంటర్‌లో చేర్పించారు. ప్రస్తుతం బొత్సకు చికిత్స కొనసాగుతోందని.. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



## అధికారులే పులిని వదిలారు.. దాన్ని చంపేస్తాం: రంపచోడవరం ఏజెన్సీ గిరిజనుల హెచ్చరిక

పాపికొండల అభయారణ్యంలో వదిలిపెట్టిన 'ఎక్స్‌ప్లోరర్' అనే పెద్దపులి ఇప్పుడు రంపచోడవరం ఏజెన్సీ గ్రామాలను వణికిస్తోంది. అడవి నుంచి పులి గ్రామాల వైపు వస్తుండటంతో తమ ప్రాణాలకు రక్షణ లేదంటూ గిరిజనులు యుద్ధానికి సిద్ధమవుతున్నారు. అధికారులే కావాలని పులిని తమ గ్రామాలపైకి వదిలారని ఆగ్రహిస్తున్నారు. విల్లులుబాణాలతో పులిపై ఎదురుదాడికి దిగుతామని ఆదివాసీలు హెచ్చరిస్తుండటంతో మన్యంలో హైటెన్షన్ నెలకొంది. ఈ నెల 6న రాజమండ్రి పరిసరాల్లో పట్టుబడ్డ ఈ పెద్దపులికి 'ఎక్స్‌ప్లోరర్' అని నామకరణం చేసి, వారం క్రితం పాపికొండల అభయారణ్యంలో అటవీ శాఖ అధికారులు విడిచిపెట్టారు. అయితే, గత ఐదు రోజులుగా ఇది బోలగొండ ఫారెస్ట్ పరిధిలోని రంప, మర్రివాడ, పెద్ద గొండ గ్రామాలకు సమీపంలోనే సంచరిస్తోంది. గత రాత్రి ఒక ఆవుదూడపై దాడి చేయడంతో గిరిజనుల సహనం నశించింది. ప్రస్తుతం అడవిలో జీడిపిక్కలు సేకరించే కీలక సమయం కావడంతో పులి భయం కారణంగా గిరిజనులు అటవీ ప్రాంతంలోకి వెళ్లలేకపోతున్నారు.




దీనివల్ల తమ ఫలసాయాన్ని కోల్పోతున్నామని, ఇప్పటికే అనేక సమస్యలతో ఉన్న తమపైకి పులిని తెచ్చిపెట్టడమేంటని వారు నిలదీస్తున్నారు. "అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మా గ్రామాలపైకి పులిని వదిలారు. మా ప్రాణాలు కాపాడుకోవడానికి మా దగ్గర ఉన్న బాణాలతో పులిపై దాడి చేస్తాం" అంటూ ఆదివాసి భారత్ పార్టీ ఇంచార్జ్ అంజిరెడ్డి ఒక వీడియో సందేశం ద్వారా హెచ్చరించారు. ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో ఫారెస్ట్ రేంజ్ అధికారులు రంగంలోకి దిగారు. పులి తన దారిన తాను వెళ్ళిపోతుందని, మరో రెండు రోజుల పాటు గిరిజనులు అడవిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. పులి దాడిలో గాయపడిన ఆవుదూడకు పశు సంవర్ధక శాఖ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు.



# ఆల్కహాల్‌పై కంట్రోల్ తప్పుతున్నారా?.!

మద్యం విపరీతంగా తాగడం వల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. అది మెదడును తీవ్రంగా ప్రభావితం చేస్తుందంటున్నారు. ఆల్కహాల్ వల్ల మెదడులోని ఐదు ముఖ్యమైన ప్రాంతాలు ప్రభావితమవుతున్నాయి. అవేంటో తెలుసుకుందాం.





### న్యూరో ట్రాన్స్ మీటర్ యాక్టివిటీ

న్యూరోట్రాన్స్‌మీటర్లు మెదడులోని నరాల సందేశాల మార్పిడిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆల్కహాల్ ఈ న్యూరోట్రాన్స్‌మీటర్ల పనితీరును మారుస్తుంది. ఇది ఆలోచనా శక్తిని తగ్గిస్తుంది.

### మెదడు నిర్మాణం

అతిగా మద్యం తాగడం వల్ల మెదడు నిర్మాణంలో మార్పులు వస్తాయి. ఇది మెదడు కణజాల పరిమాణాన్ని తగ్గిస్తుంది. ద్రవంతో నిండిన మెదడు జఠరికల పరిమాణాన్ని పెంచుతుంది. ఫలితంగా వ్యక్తి ఆలోచనా సామర్థ్యం బలహీనపడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది.

### న్యూరోకెమికల్ అసమతుల్యత

ఆల్కహాల్ ఎక్కువ తీసుకోవడం వల్ల న్యూరోట్రాన్స్‌మీటర్ల సున్నితమైన సమతుల్యత దెబ్బతింటుంది. ఈ అసమతుల్యత డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక వ్యాధులకు దారితీస్తుంది. అలాగే ఇది స్వీయ నియంత్రణను తగ్గిస్తుంది.



### మెసోలింబిక్ మార్గం

ఆల్కహాల్ డోపమైన్ స్థాయిలను పెంచడం ద్వారా మెదడు మెసోలింబిక్ వ్యవస్థను సక్రియం చేస్తుంది. ఇది ఆనందం ఉద్దీపన అనుభూతిని కలిగిస్తుంది. కాలక్రమేణా ఈ రివార్డ్ మార్గాలు పదేపదే మద్యం తాగడంతో సున్నితంగా మారతాయి.

### మెదడు పనితీరు

ఆల్కహాల్ సమస్య పరిష్కారానికి తీసుకునే చర్యలను ప్రభావితం చేస్తుంది. ఇది సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. రిస్క్ తీసుకునే ప్రవర్తనను పెంచుతుంది.

# పిల్లలు హైట్ పెరగాలంటే..

ప్రస్తుత జనరేషన్‌లో తల్లిదండ్రులు తమ పిల్లల గురించి చాలా శ్రద్ధ తీసుకోవాలి. వారు పుట్టినప్పటి నుంచి పెరిగేదాకా జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. కొంతమంది పిల్లలు వయసుకు తగ్గట్లుగా హైట్ పెరగరు. దీనికి అనేక కారణాలు ఉంటాయి. ముందుగా పిల్లలకి సరైన పోషకాహారం లభిస్తుందో లేదో గమనించాలి. పోషక విలువలు అందించకపోతే బిడ్డ ఎదుగుదల ఆగిపోతుంది. ఈ రోజుల్లో పిల్లలు ఫాస్ట్, జంక్ ఫుడ్స్ తినడానికి ఇష్టపడుతున్నారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచిది కాదు. పిల్లలు హైట్ పెరగడానికి కొన్ని ఆహారాలు అందించాలి.





### పాలు

పాలలో అన్ని రకాల పోషకాలు ఉంటాయి. పాలు సంపూర్ణ ఆహారం అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇందులో ఉండే క్యాల్షియం, ప్రొటీన్ పిల్లల ఎముకలు, కండరాల అభివృద్ధికి తోడ్పడతాయి. పిల్లలకు ఉదయం సాయంత్రం పాలు తాగేలా చూసుకోవాలి.

### గ్రీన్ లీఫీ వెజిటబుల్స్


కొంతమంది పిల్లలు ఆకు కూరలు తినడానికి ఇష్టపడరు. బదులుగా ఆయిల్, జంక్ ఫుడ్‌ను ఇష్టపడతారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆకుపచ్చ కూరగాయలను తినిపించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇందులో ఐరన్, మెగ్నీషియం, ఫైబర్, ఫోలేట్, పొటాషియం, కాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె ఉంటాయి. ఇవి పిల్లల ఎత్తును పెంచడంలో సాయపడుతాయి.

### పండ్లు

అన్ని వయసుల వారు పండ్లు తినమని సలహా ఇస్తారు. ఎందుకంటే ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఈ రోజు నుంచే పిల్లలకు పండ్లు తినిపించడం అలవాటు చేయండి.


### గుడ్డు

గుడ్లలో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. పిల్లలకు అల్పాహారంలో ఉడికించిన గుడ్లను తప్పక తినిపించాలి. ఇందులో ప్రొటీన్‌తోపాటు, పిండి పదార్థాలు, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరం పెరుగుదలపై పాజిటివ్ ప్రభావాన్ని చూపుతుంది.




# లివర్ డ్యామేజ్ లక్షణాలు ఇవే..

లివర్ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. బాడీలో జరిగే అన్ని పనుల్లో దీని సహకారం ఉంటుంది. ఇది శరీరంలోని మలినాలను బయటికి పంపిస్తుంది. అయితే కొన్ని కారణాల వల్ల లివర్ డ్యామేజ్ అవుతుంది. కానీ డ్యామేజ్ లక్షణాలు తొందరగా బయటపడవు. ఆలస్యంగా తెలియడం వల్ల అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఆల్కహాల్ తాగేవారిలో లివర్ వ్యాధులు ఎక్కువగా వస్తాయనడంలో సందేహం లేదు. కానీ వైరల్ ఇన్ఫెక్షన్, ఊబకాయం, జన్యు కారణాల వల్ల కూడా లివర్ సమస్యలు ఏర్పడుతాయి. ఇలాంటి సందర్భంలో వాటిని ముందుగా గుర్తించడం అవసరం. అలాంటి వాటి గురించి ఈ రోజు తెలుసుకుందాం.




### మలం రంగులో మార్పు

మలం మట్టి రంగులో మారితే లివర్ పనిచేయడం లేదని అర్థం. సిర్రోసిస్ వంటి వ్యాధులలో లివర్ వాపునకు గురవుతుంది. ఇది పొట్ట విస్తరణగా కారణమవుతుంది. పాదాలు, చీలమండల వాపు కూడా సంభవిస్తుంది. లివర్ వ్యాధి ఉన్న రోగులకు చర్మం కింద పిత్త లవణాలు పేరుకుపోవడం వల్ల నిరంతర దురద ఉంటుంది. ఈ దురద ఎక్కడైనా రావచ్చు కానీ అరచేతులు, అరికాళ్లలో ఎక్కువగా వస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించి లివర్ టెస్ట్ చేయించుకోవాలి.

### అలసట, బలహీనత

నిరంతర అలసట, బలహీనత కాలేయ వ్యాధికి ప్రారంభ సంకేతాలు. ఇలాంటి సందర్భంలో వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. పొట్ట పైభాగంలో నొప్పి లివర్ వాపునకు సంకేతం. ఈ నొప్పి తేలికపాటి నుంచి తీవ్రంగా మారుతుంది. కొవ్వు పదార్థాలు తిన్న తర్వాత మరింత పెరుగుతుంది. లివర్ సమస్యల వల్ల మూత్రం రంగు మారుతుంది. ఈ స్థితిలో మూత్రం రంగు టీ రంగు లేదా గోధుమ రంగులోకి మారుతుంది.



# స్టాక్ మార్కెట్లలో అమ్మకాల సునామీ...

**భారీగా పతనమైన సూచీలు**

**శుక్రవారం భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**సెన్సెక్స్ కు 961 పాయింట్లు, నిఫ్టీకి 317 పాయింట్ల నష్టం**

**విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ... అంతర్జాతీయ బలహీన సంకేతాలు**

**ఐటీ మినహా రియల్టీ, ఆటో సహా కీలక రంగాలన్నీ డీలా**

**కీలకమైన 25,350 మద్దతు స్థాయిని కోల్పోయిన నిఫ్టీ**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలను చవిచూశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా అమ్మకాలకు పాల్పడటం, అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు వెలువడటంతో సూచీలు కుప్పకూలాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో రోజంతా మార్కెట్లలో ఒత్తిడి కొనసాగింది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 961 పాయింట్లు నష్టపోయి 81,287 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 317.90 పాయింట్లు క్షీణించి 25,178 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా దాదాపు 1.10 శాతం చొప్పున నష్టపోయాయి. మార్కెట్ మొత్తం మీద 1,515 షేర్లు లాభపడగా, 2,300 షేర్లు నష్టాల్లో ముగియడం అమ్మకాల తీవ్రతను సూచిస్తోంది.

రంగాల వారీగా చూస్తే.. ఐటీ, మీడియా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా మిగిలినవన్నీ నష్టాల్లోనే ట్రేడయ్యాయి. నిఫ్టీ రియల్టీ అత్యధికంగా 2.26 శాతం పతనం కాగా, ఆటో, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా 1.69 శాతం వరకు నష్టపోయాయి. బ్యాంక్ నిఫ్టీ సైతం 1.08 శాతం క్షీణించింది. అమెరికా-ఇరాన్ అణు చర్చల్లో పురోగతి లేకపోవడంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతాయనే ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని విశ్లేషకులు చెబుతున్నారు. నిఫ్టీ కీలకమైన 25,350 మద్దతు స్థాయిని కోల్పోవడం సమీప భవిష్యత్తులో మార్కెట్ ధోరణి మారబోతోందనడానికి సంకేతమని వారు పేర్కొన్నారు. మొత్తం మీద, అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ నిధుల ప్రవాహంపై ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ స్వల్పంగా క్షీణించి 90.98 వద్ద ముగిసింది.

# ఫేక్ ఎస్టీటీ నోటీసులపై ఇన్వెస్టర్లను అప్రమత్తం చేసిన సెబీ

**గ్యారంటీ లాభాల పేరుతో 'అకౌంట్ హ్యాండ్లింగ్' సేవలను నమ్మవద్దని అలర్ట్**

**ఎస్టీటీని బ్రోకర్లే వసూలు చేస్తారు, తాము నోటీసులు ఇవ్వమని సెబీ స్పష్టీకరణ**

**అధికారిక ఈమెయిల్స్ ఏంవఎఱ.స్త్రశీఙ.ఱఅ తోనే ఉంటాయని వెల్లడి**

**సెబీ రిజిస్టర్డ్ మధ్యవర్తులతోనే లావాదేవీలు జరపాలని సూచన**



**ముంబై:** మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లను క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ అప్రమత్తం చేసింది. నకిలీ సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ నోటీసులు, గ్యారంటీ లాభాల పేరుతో మోసపూరిత 'అకౌంట్ హ్యాండ్లింగ్' సేవల మోసాలు పెరిగిపోతున్నాయని హెచ్చరించింది. ఈ మేరకు శుక్రవారం కీలక ప్రకటన విడుదల చేసింది.

కొంతమంది మోసగాళ్లు సెబీ పేరు, లోగో, సీల్‌తో నకిలీ లెటర్‌హెడ్‌లు సృష్టించి, ఎస్టీటీ బకాయిలు చెల్లించాలంటూ ఇన్వెస్టర్లకు ఫేక్ నోటీసులు పంపుతున్నట్లు సెబీ గుర్తించింది. అయితే, 2004 ఫైనాన్స్ చట్టం ప్రకారం ఎస్టీటీని ప్రతి లావాదేవీ సమయంలో బ్రోకర్లే ఆటోమేటిక్‌గా వసూలు చేస్తారని, తాము ఎలాంటి డిమాండ్ నోటీసులు జారీ చేయమని సెబీ స్పష్టం చేసింది. సెబీ అధికారులుగా నటిస్తూ ఈ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది.

అదేవిధంగా, ఎలాంటి నష్టం లేకుండా గ్యారంటీగా లాభాలు అందిస్తామని చెబుతూ 'పీఎంఎస్ సర్వీస్ ప్రొవైడర్లు' లేదా 'ఫండ్ మేనేజర్లు'గా చెప్పుకునే వారి పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని సెబీ సూచించింది. ఇతర ఇన్వెస్టర్ల ఖాతాలలో తాము భారీ లాభాలు సంపాదించి పెట్టామని నమ్మించి, పెట్టుబడిదారుల డీమ్యాట్ లేదా ట్రేడింగ్ ఖాతాలను తమ చేతుల్లోకి తీసుకుని మోసం చేస్తున్నారని వివరించింది.

సెబీ నుంచి వచ్చే అధికారిక ఈమెయిల్స్ అన్నీ ఏంవఎఱ.స్త్రశీఙ.ఱఅ డొమైన్‌తోనే ముగుస్తాయని, ఇన్వెస్టర్లు దీన్ని గమనించాలని సూచించింది. ఏదైనా ఉత్తర్వులకు సంబంధించిన ఆన్‌లైన్ చెల్లింపులు చేయాల్సి వస్తే, సెబీ అధికారిక పేమెంట్ గేట్‌వే ద్వారా మాత్రమే చేయాలని స్పష్టం చేసింది. మధ్యవర్తుల ప్రామాణికతను నిర్ధారించుకునేందుకు ఇటీవల 'సెబీ చెక్' అనే కొత్త విధానాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా యూపీఐ ఐడీ లేదా బ్యాంకు ఖాతా వివరాలు ఎంటర్ చేసి, సదరు మధ్యవర్తి సెబీ రిజిస్టర్డ్ అవునో కాదో తెలుసుకోవచ్చు. ఇన్వెస్టర్లు ఎల్లప్పుడూ తమ గుర్తింపు పొందిన మధ్యవర్తులతోనే లావాదేవీలు జరపాలని సెబీ స్పష్టం చేసింది.

# యువతకు ఫేవరెట్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ...

**సీఎంఆర్ సర్వేలో వెల్లడి**

**వినియోగదారుల సంతృప్తిలో అగ్రస్థానం, అత్యధిక నెట్ ప్రమోటర్ స్కోర్**

**కెమెరా, బ్యాటరీ లైఫ్‌కే యువత ప్రాధాన్యత అని సర్వేలో స్పష్టం**

**ఏడాదిలోపు కొత్త ఫోన్ కొనేందుకు 50 శాతం పైగా యూజర్ల ఆసక్తి**




**న్యూఢిల్లీ:** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ, భారతీయ యువతలో తన పట్టును మరింత బలోపేతం చేసుకుంటోంది. తాజాగా విడుదలైన 'సీఎంఆర్ కన్స్యూమర్ ఇన్‌సైట్ సర్వే 2026'లో 'యువతలో అత్యంత ప్రజాదరణ పొందిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్'గా రియల్‌మీ నిలిచింది. వినియోగదారుల నుంచి లభిస్తున్న అధిక సంతృప్తి, ప్రత్యేకించి జనరేషన్ జెడ్, మిలీనియల్స్‌లో బలమైన ఆదరణే ఇందుకు కారణమని సర్వే వెల్లడించింది.

దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో నిర్వహించిన ఈ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుత యువత శక్తివంతమైన పనితీరు, నమ్మకమైన బ్యాటరీ లైఫ్, తమ వ్యక్తిత్వానికి అద్దం పట్టే డిజైన్‌ను కోరుకుంటున్నారని స్పష్టమైంది. కొత్త ఫోన్ కొనుగోలులో కెమెరా క్వాలిటీ (86 శాతం), ఫాస్ట్ ఛార్జింగ్‌తో కూడిన బ్యాటరీ లైఫ్ (79 శాతం) కీలక పాత్ర పోషిస్తున్నాయని తేలింది. సర్వేలో పాల్గొన్న వారిలో 74 శాతం మంది రోజుకు నాలుగు గంటలకు పైగా ఫోన్‌పైనే గడుపుతున్నట్లు తెలిసింది.

# పోరాట స్ఫూర్తిని రగిలించేలా కొత్త జెర్సీ..!




**లక్నో:** ఐపీఎల్ ఫ్రాంచైజీ లక్నో సూపర్ జెయింట్స్ కొత్త జెర్సీని విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్ వారసత్వ సంపద, చారిత్రక కట్టడాలను ప్రతిబింబించేలా లోగోను రూపొంచింది యాజమాన్యం.. శుక్రవారం సరికొత్త జెర్సీని ఆవిష్కరించింది. ఎరుపు రంగుపై నీలం రంగు నిలువు గీతలు.. గరుడ, కిరీటం, ఏనుగు బొమ్మల లోగోతో ఆకట్టుకునేలా ఉన్న జెర్సీ వీడియోను ఫ్రాంచైజీ తమ ఎక్స్ పోస్ట్‌లో పెట్టింది. కెప్టెన్ రిషభ్ పంత్, ఎడెన్ మర్క్‌రమ్, పేసర్ మహమ్మద్ షమీలు కొత్త జెర్సీని ధరించి మురిసిపోయారు.


ఐపీఎల్ ట్రోఫీ వేటక సిద్ధమవుతున్న లక్నో సూపర్ జెయింట్స్ 19వ సీజన్ నుంచి కొత్త జెర్సీతో మైదానంలోకి దిగనుంది. ఉత్తరప్రదేశ్ లక్నో పట్టణం చరిత్రను ప్రతిబింబించేలా జెర్సీని రూపొందించారు. వారణాసిలో గంగానది ఒడ్డున పట్టే మహా హారతి నుంచి వెలువడే దట్టంగా వెలువడే ధూపం.. చారిత్రక కట్టడం తాజ్ మహల్ తేజస్సు.. ఆగ్రాకోట వెలుగులు.. గంగా జలాల పరవళ్లు.. ఈ నాలుగు కలగలిసినట్టుగా జెర్సీ రంగు, డిజైన్ తయారు చేశారు. ఇక లోగోపై గరుగ్మంతుడు, కిరీటం, ఏనుగు బొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

### విశిష్టతను, స్ఫూర్తిగాథను చాటేలా

ఉత్తరప్రదేశ్.. లక్నో పట్టణ విశిష్టతను, స్ఫూర్తిగాథను చాటేలా సరికొత్తగా.. అభిమానులకు అమితంగా నచ్చేలా కొత్త లోగో రూపొందించారు. తాజా లోగోలో శక్తివంతమైన గరుడు, కిరీటం, ఏనుగు బొమ్మలు ఉన్నాయి. గరుడ (గరుత్మంతుడు) చిహ్నం ధైర్యానికి ప్రతీక. సవాళ్లను స్వీకరించడం.. వెనక్కి తిరిగి చూడకపోవడం, ఉన్నత శిఖరాలకు చేరడాన్ని సూచిస్తుంది. లక్నో జట్టు అనుసరించే భయమన్నది ఎరుగని క్రికెట్‌ను, సమిష్టిగా ఆడితే అసాధ్యమైన లక్ష్యమంటూ ఉండదని చాటుతుంది. కిరీటం విషయానికొస్తే దర్పం, బాధ్యతకు ప్రతీక. మైదానంలోకి దిగిన ప్రతిసారి లక్షలాదిమంది ఆశల్ని లక్నో జట్టు మోస్తుంది. లక్నో జెర్సీ ధరించడం ఎంతో గర్వకారణం. ప్రతిరోజు ఈ గౌరవాన్ని పొందాలని కిరీటం సూచిస్తుంది. కొత్త లోగుకు ఏనుగు బొమ్మ గుండెతో సమానం. బలం, తెలివి, ఓపిక, ఐక్యత.. ఈ లక్షణాలకు ప్రతిరూపమే ఏనుగు. ఫలితంతో సంబంధం లేకుండా సీజన్ సీజన్‌కు అభిమానుల నుంచి లభిస్తున్న నిరంతర మద్దతు, వారు చూపించే కృతజ్ఞతా భావానికి బొమ్మ ప్రతీక. క్లుప్తంగా చెప్పాలంటే లక్నో వీధులకు సబంధించిన లోగో ఇది. ఇంట్లో ఉండి క్రికెట్ మ్యాచ్‌లు చూసే కుటుంబాలు, ఏదో ఒకరోజు లక్నో జెర్సీ వేసుకోవాలని ఆశపడే యువతకు ఇది ప్రతిబింబం. కొత్త లోగో.. ఈ ప్రాంత చరిత్ర, గౌరవం, ఐకత్య సందేశానికి ప్రతీక.

# తండ్రికి కన్నీటి వీడ్కోలు..

**పాడె మోసిన రింకూ సింగ్..**



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ మధ్యలోనే చేదు వార్తను విన్న భారత క్రికెటర్ రింకూ సింగ్ తన తండ్రికి కన్నీటి వీడ్కోలు పలికాడు. క్యాన్సర్‌తో పోరాడి కన్నుమూసిన తండ్రి ఖంచంద్ సింగ్ అంత్యక్రియల్లో రింకూ పాల్గొన్నాడు. తనను క్రికెటర్‌గా చూసేందుకు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చిన నాన్నను ఇంకొన్నాళ్లు బతికించుకోలేక పోయాననే బాధతో అతడు కుమిలిపోయాడు. పాడె మోస్తూ తండ్రి తమకోసం పడిన బాధల్ని.. గుర్తు చేసుకున్న భారత స్టార్ మౌనంగా రోదించాడు.

పొట్టి ప్రపంచకప్ సమయంలో భారత ఆటగాడు రింకూ సింగ్ ఇంట్లో విషాదం నెలకొంది. గత కొంతకాలంగా కాలేయం క్యాన్సర్‌తో బాధ పడుతున్న అతడి తండ్రి ఖంచంద్ సింగ్ మరణించాడు. సూపర్ 8లో జింబాబ్వేతో కీలకమైన మ్యాచ్‌కు ముందే ఆయన ఆరోగ్యం విషమించింది. గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ ఆస్పత్రిలో ఆయనను చేర్పించారనే విషయం తెలిసిన రింకూ.. అత్యవసరంగా జట్టును వీడాడు. ఆరోగ్యం కాస్త మెరుగ్గా అనిపించిండంతో అతడు గురువారం మళ్లీ స్క్వాడ్‌తో కలిశాడు.

అయితే.. జింబాబ్వేపై 72 వికెట్ల విజయంతో సెమీస్ ఆశలు నిలిచిన సంతోషంలో ఉండగానే తండ్రి మరణ వార్త రింకూ చెవిన పడింది. దాంతో.. చెపాక్ నుంచి హుటాహుటిన అలీగఢ్ వెళ్లిన రింకూ.. శుక్రవారం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. రింకూ సింగ్ తండ్రి మృతిపట్ల భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ.. క్రికెటర్లు శిఖర్ ధావన్, ఇర్ఫాన్ పఠాన్‌లు సంతాపం తెలిపారు. ఈ పరిస్థితుల్లో సెమీస్ లక్ష్యంగా భారత జట్టు మార్చి 1న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌తో తలపడనుంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌కు ఈ చిచ్చరపిడుగు అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.

# ప్రతీక, హర్మన్‌ప్రీత్ పోరాటం సరిపోలే..

**వన్డే సిరీస్ చేజార్చుకున్న టీమిండియా..!**



**సిడ్నీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టుకు భారీ షాక్. పొట్టి సిరీస్‌ను పట్టేసిన టీమిండియా వన్డే సిరీస్‌ను చేజార్చుకుంది. తొలి వన్డేలో కంగుతిన్న అమ్మాయిలు.. నిర్ణయాత్మక మ్యాచ్‌లో సర్వశక్తులు ఒడ్డలేకపోయారు. ఓపెనర్ ప్రతీకా రావల్(52), హర్మన్‌ప్రీత్ కౌర్(54)లు కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా.. 252 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేధించింది. జార్జియా వోల్(101) సెంచరీతో, ఫొబే లిచ్‌ఫీల్డ్(80) హాఫ్ సెంచరీతో విజృంభించగా.. మరో మ్యాచ్ ఉండగానే ఆతిథ్య జట్టు సిరీస్‌ను గెలుపొందింది.

విశ్వవిజేతగా తొలి విదేశీ పర్యటనలోనే భారత జట్టు వన్డే సిరీస్ చేజార్చుకుంది. నిరుడు వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించిన టీమిండియా.. ఈసారి మాత్రం తలొగ్గింది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓటమితో సిరీస్‌ను కోల్పోయింది. నిర్ణయాత్మక రెండో వన్డేలో 251 రన్స్‌కే పరిమితమైన హర్మన్‌ప్రీత్ సేన ప్రత్యర్థిని కట్టడి చేయలేకపోయింది. ఆరంభంలోనే అలీసా హీలీ(6)ని కష్వీ గౌతమ్(2-47) బౌల్డ్ చేసి బ్రేకిచ్చినా.. ఫొబే లిచ్‌ఫీల్డ్(80), జార్జియా వోల్(101)లు క్రీజునంటుకొని భారత బౌలర్లను విసిగించారు. దూకుడుగా ఆడిన వీరిద్దరూ అర్ధ శతకాలతో లక్ష్యాన్ని కరిగించారు. లిచ్‌ఫీల్డ్ ఔటైనా.. జోరు తగ్గించని వోల్ సెంచరీతో విరుచుకుపడింది. కష్వీ గౌతమ్ ఓవర్లో వోల్ వెనుదిరిగినా.. బేత్ మూనీ(31).. అష్లీ గార్డ్‌నర్(19 నాటౌట్)లు లాంఛనం పూర్తి చేశారు. నామమాత్రమైన మూడో వన్డే మార్చి1 న హోబర్ట్‌లో జరుగనుంది.

### శుభారంభం లభించినా

సిరీస్ సమం చేయాల్సిన మ్యాచ్‌లో శుభారంభం లభించినా భారీ స్కోర్ చేయలేకపోయింది భారత్. ఓపెనర్లు స్మృతి మంధాన(31), ప్రతీకా రావల్(52)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో ఆస్ట్రేలియా బౌలర్లను ఒత్తిడిలో పడేశారు. ధాటిగా ఆడుతున్న మంధానను అష్లీ గార్డ్‌నర్ బౌల్డ్ చేయడంతో.. 78 వద్ద తొలి వికెట్ పడింది. జెమీమా రోడ్రిగ్స్(11) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగడంతో.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(54) సమయోచితంగా ఆడింది. 98కే రెండు వికెట్లు పడిన వేళ.. ప్రతీకతో, అమన్‌జోత్ కౌర్(13), రీచా ఘోష్(22), కష్వీ గౌతమ్(25)లతో తను కీలక భాగస్వామ్యాలు నెలకొల్పింది. మేగన్ షట్ ఓవర్లో హర్మన్‌ప్రీత్ వెనుదిరగడంతో ధాటిగా ఆడేవాళ్లు కరువయ్యారు. ఆఖర్లో క్రాంతి గౌడ్(19), వైష్ణవీ శర్మ(10 నాటౌట్)లు బ్యాట్ ఝులిపించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 251కే పరిమితమైంది.

# ఉత్కంఠ పోరులో కంగుతిన్న న్యూజిలాండ్..

**పాకిస్థాన్ సెమీస్ ఆశలు సజీవం..!**




**కొలంబో:** సెమీస్ బెర్తు దక్కాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో న్యూజిలాండ్‌కు గుండెకోతే మిగిలింది. ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌ను విల్ జాక్స్(32 నాటౌట్) రెహాన్ అహ్మద్(19 నాటౌట్)లు సంచలన ఆటతో ఇంగ్లండ్ వైపు తిప్పారు. ప్రధాన బ్యాటర్లను ఔట్ చేసి గెలుపుపై ధీమాతో ఉన్న కివీస్‌కు షాకిస్తూ ఈ ద్వయం.. రెండు ఓవర్లలోనే 38 రన్స్ రాబట్టి బ్లాక్ క్యాప్స్ సెమీస్ చేరకుండా అడ్డుపడ్డారు. తద్వారా పాకిస్థాన్‌కు కూడా తలుపులు తెరిచే ఉన్నాయి. పొట్టి ప్రపంచకప్ నాకౌట్ దశను ఇంగ్లండ్ అజేయంగా ముగించింది. శ్రీలంక, పాకిస్థాన్‌ను చిత్తు చేసి సెమీస్ బెర్తు పట్టేసిన ఇంగ్లండ్ చివరి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్‌కు పంచ్ ఇచ్చింది. ప్రేమదాస మైదానంలో ఉత్కంఠ రేపిన పోరులో హ్యారీ బ్రూక్ సేన జయభేరి మోగించింది. గ్లెన్ ఫిలిప్స్ వేసిన 18వ ఓవర్లో విల్ జాక్స్(32 నాటౌట్), రెహాన్ అహ్మద్(19 నాటౌట్)లు 22 రన్స్ రాబట్టి మ్యాచ్‌ను కివీస్ నుంచి లాగేసుకున్నారు. 4 వికెట్ల తేడాతో గెలుపొందిన ఇంగ్లండ్ గ్రూప్ బీలో రెండో సెమీస్ బెర్తు రేసును ఆసక్తికరంగా మార్చేసింది. కివీస్ నిర్దేశించిన 160 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్లు ఫిల్ సాల్ట్(2), జోస్ బట్లర్(0)లు విఫలమయ్యారు. జాకబ్ బెథెల్(21) జతగా హ్యారీ బ్రూక్(26) దూకుడు పెంచగా.. పవర్ ప్లేలో 47 రన్స్.. వచ్చాయి. శాంట్నర్ కట్టడి చేస్తుండడంతో గ్లెన్ ఫిలిప్స్ ఓవర్లో పెద్ద షాట్‌కు యత్నించిన బ్రూక్ బౌండరీ లైన్‌వద్ద డారిల్ మిచెల్ చేతికి దొరికాడు. కాసేపటికే రచిన్ రవీంద్ర ఓవర్లో బెథెల్ డీప్ మిడ్ వికెట్ దిశలో కొట్టిన బంతిని ఫిలిప్స్ గాల్లోకి డైవ్ చేస్తూ అందుకున్నాడు. దాంతో.. 58 వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది ఇంగ్లండ్. ఐదో వికెట్‌కు కీలక భాగస్వామ్యంలో ఇంగ్లండ్‌ను గెలుప దిశగా నడిపిస్తున్న టామ్ బ్యాంటన్(39), సామ్ కరన్(24)ల జోడీని రచిన్ విడదీశాడు. సామ్ కరన్ నేరుగా ఫిలిప్స్ చేతుల్లోకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగడంతో 42 రన్స్ భాగస్వామ్యానికి తెరపడింది.

భారీ షాట్లు ఆడుతున్న అతడిని చాప్‌మన్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు. కానీ, ఫిలిప్స్‌కు షాకిస్తూ రెహాన్ అహ్మద్(19 నాటౌట్) స్ట్రెయిట్‌గా భారీ సిక్సర్ బాదగా నాలుగో బంతిని అమాంతం స్టాండ్స్‌లోకి పంపిన విల్ జాక్స్(32 నాటౌట్).. ఐదో బంతినీ బౌండరీకి తరలించాడు. చివరి బంతికి ఫోర్ రాగా.. సమీకరణం 12 బంతుల్లో 21 రన్స్‌గా మారింది. శాంట్నర్ ఓవర్లో రెహాన్ సిక్సర్‌తో చివరి ఓవర్లో 5 పరుగులు అవసరమయ్యాయి. హెన్రీ సంధించిన మూడో బంతి వికెట్ కీపర్ చేతులకు దొరక్కుండా బౌండరీకి వెళ్లడంతో 4 వికెట్లతో ఇంగ్లండ్ గెలుపొందింది.

సెమీస్‌పై గురి పెట్టిన న్యూజిలాండ్ శుభారంభం లభించినా భారీ స్కోర్ చేయలేకపోయింది. పవర్ ప్లేలోనే దంచేసి 56 రన్స్ పిండుకున్న ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(35), ఫిన్ అలెన్(29) ఔటయ్యాక.. మిడిలార్డర్‌ను ఇంగ్లండ్ స్పిన్నర్లు చుట్టేశారు. ఆదిల్ రషీద్(2-28), విల్ జాక్స్(2-23) తిప్పేయగా.. కివీస్ హిట్టర్లు తోకముడిచారు. సారథి మిచెల్ శాంట్నర్(9 నాటౌట్) చివరి బంతిని స్టాండ్స్‌లోకి పంపడంతో కివీస్ జట్టు ఇంగ్లండ్‌కు 160 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది.

MOVIE TIME

## ఉదయపూర్ ఎయిర్‌పోర్టులో కొత్త జంట సందడి



**టాకీస్:** టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో అత్యంత వైభవంగా వీరి వివాహం జరిగింది. అయితే పెళ్లయిన మరుసటి రోజు ఈ నూతన వధూవరులు ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యక్షమవడంతో అక్కడ ఒక్కసారిగా సందడి నెలకొంది. కొత్త పెళ్లికూతురు రష్మిక ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోగా, విజయ్ స్టైలిష్ ఇండో-వెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో రాజసం ఉట్టిపడేలా కనిపించారు. తమ అభిమాన జంటను చూడటానికి ఎయిర్‌పోర్ట్‌కు భారీగా చేరుకున్న అభిమానులకు విజయ్, రష్మిక చిరునవ్వుతో అభివాదం చేస్తూ, ఫ్లయింగ్ కిసెస్ ఇస్తూ ఉత్సాహపరిచారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. వీరు నేరుగా ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని, కేంద్రమంత్రి అమిత్ షాను కలిశారు.

## 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు లైన్ క్లియర్..

స్టే ఎత్తివేసిన హైకోర్టు




**టాకీస్:** బాలీవుడ్ నుంచి రాబోతున్న 'ది కేరళ స్టోరీ 2-గోస్ బియాండ్' చిత్రానికి కేరళ హైకోర్టులో ఊరట లభించింది. ఈ సినిమా విడుదలపై ఫిబ్రవరి 26న విధించిన 15 రోజుల స్టేను జస్టిస్ ఎస్.ఎ. ధర్మాధికారి మరియు జస్టిస్ పి.వి. బాలకృష్ణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. సెన్సార్ బోర్డు నిబంధనల ఉల్లంఘన జరిగిందన్న కారణంతో జస్టిస్ బెచు కురియన్ థామస్ నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఫిబ్రవరి 26న సినిమాను నిలిపివేస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను డివిజన్ బెంచ్ పక్కన పెట్టింది.

అయితే కోర్టు తీర్పును సవాల్ చేస్తూ చిత్ర నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాడు. దీనిపై నేడు విచారణ జరిపిన కోర్టు, పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ స్వభావం ఉన్న ఇలాంటి అంశాలను సింగిల్ బెంచ్ విచారించడం సరికాదని అభిప్రాయపడింది. వాక్ స్వాతంత్ర్యం మరియు కళాత్మక స్వేచ్ఛను గౌరవిస్తూ, సినిమా విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అన్ని న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతుంది.



## దీపిక అవకాశాలు చేజార్చుకుంటోందా ?

**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణెళ ఇటీవల వరుస వార్తలతో ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారుతున్నారు. ఆమె కండీషన్స్ కారణంగా ఇప్పటికే ఒప్పుకున్న ప్రాజెక్టులు చేజారిపోతున్నాయనే ప్రచారం గత కొద్ది రోజులుగా నడుస్తోంది. ముఖ్యంగా టాలీవుడ్‌లో భారీ స్థాయిలో తెరకెక్కుతున్న స్పిరిట్, కల్కి 2 చిత్రాల నుంచి ఆమె బయటకు వచ్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా మరో హాలీవుడ్ అవకాశం కూడా చేజారిందనే టాక్ వినిపిస్తోంది. హాలీవుడ్‌లో పాపులర్ సిరీస్‌గా రూపొందిన ది వైట్ లోటస్ నాలుగవ సీజన్ కోసం దీపికా పదుకొనే పేరును మేకర్స్ పరిశీలించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గ్లోబల్ రీచ్ ఉన్న ఈ సిరీస్‌లో నటించే అవకాశం దక్కింది అంటే అంతర్జాతీయంగా మంచి గుర్తింపు దక్కే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్ట్ కోసం మేకర్స్ ఆమెను ఆడిషన్‌కు రావాలని కోరినట్లు సమాచారం. కానీ, తాను ఆడిషన్‌కు హాజరు కాలేనని దీపికా స్పష్టం చేసినట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో ఆమె స్థానంలో మరో నటిని ఎంపిక చేసుకునే దిశగా 'ది వైట్ లోటస్' టీమ్ ముందుకు సాగిందని తెలుస్తోంది. ప్రముఖ అంతర్జాతీయ సిరీస్‌లో నటించే అవకాశం కోల్పోయిందనే వార్తలతో దీపికా అభిమానులు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికే కొన్ని పెద్ద ప్రాజెక్టుల నుంచి బయటకు వచ్చిన నేపథ్యంలో, హాలీవుడ్ కమ్‌బ్యాక్‌కు ఇది మంచి అవకాశంలా భావించకుండా ఇలా ఎందుకు బయటకు వచ్చిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## విరోష్ జంట పోస్టులకు మిలియన్లకొద్దీ వ్యూస్

**టాకీస్:** టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మికలు మూడు ముళ్ల బంధంతో ఒక్కటయిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26, గురువారం ఉదయం 10 గంటల 10 నిమిషాలకు విజయ్, రష్మిక మెడలో తాళి కట్టడంతో వీరి వివాహం సంప్రదాయబద్ధంగా పూర్తయ్యింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరైన ఈ వేడుక రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో హిందూ సాంప్రదాయాల ప్రకారం ఘనంగా జరిగింది. పెళ్లి అనంతరం నూతన దంపతులు తమ ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వివాహ వేడుక ఫోటోలను షేర్ చేస్తూ రష్మిక హృదయాన్ని తాకే సందేశాన్ని పోస్ట్ చేశారు. హాయ్ మై లవ్స్.. నా భర్త విజయ్ దేవరకొండని పరిచయం చేస్తున్నాను అంటూ ప్రారంభించిన ఆమె, విజయ్ తన జీవితంలో ఎంత ప్రత్యేకమో భావోద్వేగంగా వివరించారు. నిజమైన ప్రేమ అంటే ఏమిటో చూపించిన వ్యక్తి విజయ్ అని, ప్రతిరోజూ పెద్ద కలలు కనమని ప్రోత్సహించిన వ్యక్తి ఆయనేనని చెప్పారు. తనలోని పాజిటివిటీని వెలికితీసిన వ్యక్తి విజయ్ అంటూ, 'నేను ఈ వ్యక్తి గురించి ఒక పుస్తకం రాయగలను' అని రష్మిక పలు ఫొటోలు షేర్ చేశారు. అలానే విజయ్ దేవరకొండ కూడా భావోద్వేగ పోస్టుతో అభిమానులను ఆకట్టుకున్నారు. ఒక రోజు ఆమెను చాలా మిస్ అయ్యాను. ఆమె ఉంటే నా రోజు ఇంకా బాగుండేదని అనిపించింది. ఆమెతో ఉంటే ఎక్కడైనా ఇంటి అనుభూతి కలుగుతుందని భావించాను. అందుకే నా బెస్ట్ ఫ్రెండ్‌ను నా భార్యగా చేసుకున్నాను. 26.02.2026' అంటూ తన ప్రేమను వ్యక్తం చేస్తూ పిక్స్ షేర్ చేశారు. అయితే విజయ్ దేవరకొండ పెట్టిన పోస్ట్‌కి కొద్ది గంటలలోనే 13 మిలియన్స్‌కి పైగా వ్యూస్ రాగా, రష్మిక పోస్ట్‌కి 15 మిలియన్స్‌కి పైగా వ్యూస్ వచ్చినట్లు తెలుస్తుంది. అంటే ఇద్దరికి కలిపి 28 మిలియన్స్‌కి పైగానే వ్యూస్ వచ్చాయి. ఇది సరికొత్త రికార్డ్ అంటున్నారు. భారతీయ సెలబ్రిటీల వివాహ జీవితాలలో ఇదో సరికొత్త రికార్డ్ అని చెబుతున్నారు. ఇక వీరి రిసెప్షన్ మార్చి 4న హైదరాబాద్ వేదికగా అట్టహాసంగా జరగనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ నూతన దంపతులు కలిసి రణబాలి అనే పీరియడ్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. భార్యాభర్తలుగా మారిన తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం.




## ప్రాణస్నేహితులిద్దరూ వివాహంతో ఒక్కటయ్యారు

కళ్యాణి ప్రియదర్శన్ పోస్ట్

**టాకీస్:** క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక మందన్నా వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. పెళ్లి అనంతరం విజయ్?రష్మిక తమ వివాహ వేడుక ఫోటోలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. దీంతో 'విరోష్' జంటకు అభిమానుల నుంచి శుభాకాంక్షల వెల్లువ కురుస్తోంది.

ఇదిలా ఉండగా, రష్మికకు స్నేహితురాలైన కళ్యాణి ప్రియదర్శన్ సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. విజయ్-రష్మికల పెళ్లి ఫోటోను షేర్ చేస్తూ ఆమె భావోద్వేగంగా రాసుకొచ్చారు. అత్యంత దయగల అమ్మాయి తన ప్రాణ స్నేహితుడిని వివాహం చేసుకోవడం నేను చూశాను. ఆమె అతడి వైపు అడుగులు వేస్తూ వస్తున్నప్పుడు ఇద్దరి కళ్లలో కనిపించిన ఆనందభాష్పాలు వారి ప్రేమకు గుర్తులుగా మారాయి అంటూ పేర్కొన్నారు. అలాగే, ఆమె ప్రతి అడుగు ఎన్నో భావోద్వేగ క్షణాలను మోసుకువస్తున్నట్టుగా అనిపించింది. వారి మౌనమే ప్రతిదానికి సమాధానంగా నిలిచింది. స్నేహంగా మొదలై ప్రేమగా మారిన ఈ జంటను ఇలా చూడటం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. వీరికి ఇది మరో అందమైన ప్రారంభం అని కళ్యాణి తన పోస్ట్‌లో తెలిపారు. కళ్యాణి ప్రియదర్శన్ చేసిన ఈ ఎమోషనల్ పోస్ట్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. అభిమానులు ఆమె





పోస్ట్‌ని షేర్ చేస్తూ, నూతన దంపతులకు మరోసారి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలలో కలిసి నటించిన ఈ జంట ఇప్పుడు భార్య భర్తలుగా మారారు. స్నేహం ప్రేమగా మారి ఇప్పుడు వివాహ బంధంతో ఒకటవ్వడం అభిమానులను ఆనందంలో ముంచెత్తుతోంది.టాలీవుడ్‌లో ఈ పెళ్లి వేడుక హాట్ టాపిక్‌గా మారగా, సెలబ్రిటీలు, ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా కొత్త జంటకి ఆశీస్సులు అందిస్తున్నారు.

## కామెడీలో కథాత్మక జోడింపు

విష్ణు విన్యాసం మూవీ

**టాకీస్:** శ్రీవిష్ణుని మ్యాన్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ అనే పేరుంది. దానికి తగ్గట్టే 'విష్ణు విన్యాసం' సినిమాను మొదట్నుంచీ పూర్తి వినోదాత్మక చిత్రంగా ప్రచారం చేశారు. శ్రీవిష్ణు కామెడీ మూవీ అనగానే ఆడియన్స్‌లో అంచనాలు కామన్. దాంతో నిర్మాణంలో ఉండగానే సినిమాపై హైప్ మొదలైంది. దానికి తగ్గట్టు ప్రచార చిత్రాలు కూడా సినిమాపై అంచనాలు పెంచాయి. 'విష్ణు విన్యాసం' అనే టైటిల్ పెట్టి తొలి అడుగులోనే ఆడియన్స్‌లో మార్కులు కొట్టేశాడు దర్శకుడు యదునాథ్ మారుతీరావు. విష్ణు(శ్రీవిష్ణు) ఓ కాలేజ్‌లో ట్రైనీ లెక్చరర్‌గా పని చేస్తుంటాడు. తను పర్మినెంట్ అవ్వాలంటే అల్రెడీ అక్కడ పనిచేస్తున్న లెక్చరర్స్‌లో ఎవరో ఒకరి దగ్గర అసిస్టెంట్‌గా కొన్నాళ్లు పనిచేయాలి. తనెవరి దగ్గరైతే పనిచేశాడో.. వాళ్లకు విష్ణు ప్రవర్తన, కేపబులిటీ నచ్చితే.. వాళ్లు కాలేజ్ హై కమాండ్‌కి రిఫర్ చేస్తే అప్పుడు అతను పర్మినెంట్ లెక్చరర్ అవుతాడు. దీనికోసం సర్వవిధాలా ప్రయత్నిస్తుంటాడు విష్ణు. అయితే.. విష్ణుని ఎలాగైనా కాలేజ్ నుంచి పంపించేయాలని కొందరు లెక్చరర్స్ ప్రయత్నిస్తుంటారు. విష్ణుని ఎవరి దగ్గరా చేరనీయకంపడా పావులు కదుపుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో అదే కాలేజ్‌లో పనిచేస్తున్న లేడీ లెక్చరర్ మనీషా(నయన్‌సారిక) విష్ణుని తన అసిస్టెంట్‌గా చేర్చుకుంటుంది. కొన్ని నాటకీయ పరిణామాల కారణంగా మనీషా, విష్ణు ప్రేమలో పడతారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.